పెన్ పవర్ తెలంగాణ రౌండప్

గతనెల జూలై 28న టిపిఎస్ ముఖేష్ సింగ్ ఆధ్వర్యంలో సీలింగ్.. ఫైల్‌ఫొటో

'రుద్ర' సీజ్ చేస్తే..!

సెట్‌బ్యాకుల ఆక్రమణ కూల్చేసినట్టేనా..?

- 6 మీటర్లు(20 అడుగులు) ఉండాల్సిన సెట్‌బ్యాకులు.. జీరోకు కుదించారు..
- సెట్‌బ్యాకుల ఆక్రమణ కళ్ళెదుటే సాక్షాత్కరిస్తుంటే 'సీజింగ్' డ్రామా ఏంటి..?
- నిర్మాణ చట్టాలను విస్మరించి..! చట్టబద్ధత లేని నేతల సిఫార్సులకు ప్రాధాన్యత..

ఈనెల 12న సీఎంసీ జోనల్ కమిషనర్ పరిశీలన..

ఈ నెల 12న రుద్ర అక్రమ నిర్మాణం పరిశీలించిన జోనల్ కమిషనర్.. ఊహాజనిత ఏఐ చిత్రం..

- గతంలో వాళ్ళు..! ఇప్పుడు వీళ్ళు..! అధికారులు మారినా..!దందా యధాతథం.?
- పట్టణ ప్రణాళికలో జాడలేని పారదర్శకత.! అధికారుల ముసుగులో లంచావతారులు.?
- ఇద్దరు కరప్షన్ అధికారుల చేతివాటం..? రెండు సర్కిల్‌లో అక్రమ కట్టడాలే లక్ష్యం..!
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో టౌన్‌ప్లానింగ్ అక్రమ నిర్మాణాల దందా..?
- సిఎంసి కమిషనర్ 'ఎస్‌టిఎఫ్' కమిటీ నియామకం దేనికి సంకేతం..?
- అక్రమ నిర్మాణాలపై చర్యలకా..? దందా బలోపేతం కోసమా.?
- దుండిగల్ సర్కిల్- నిజాంపేట్ సర్కిల్ 'డీసీ'లు అలంకార ప్రాయమేనా..?
- హోదాలతో కుర్చీలకు వన్నెతెచ్చే అధికారులూ.. హుందాగా వ్యవహరించండి..
- అక్రమ కట్టడాల దందాలో అందరూ 'వాటాదారులేనని వ్యంగ్యారోపణలు..?

- 'ఏసిపి-టిపిఎస్' అవగాహనతోనే విధులు నిర్వర్తిస్తున్నారా..? అక్రమార్జనే ధ్యేయమా..?
- అటు దుండిగల్ సర్కిల్-59..! ఇటు నిజాంపేట్ సర్కిల్-58లో ఇదే దందా..?
- నిద్రావస్థలో డిప్యూటీ కమిషనర్‌లు..? 'సిఎంసి' కమిషనర్ సిఫార్సుల 'అమలు'..?
- టౌన్‌ప్లానింగ్‌పై మీ నిఘా ఏది..? జోనల్ కమిషనర్ 'రుద్ర' సందర్శన దేనికి సంకేతం..?
- 'తిలాపాపం తలాపిడికెడు'గా టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ తీరుపై విమర్శలెన్నో..?

- ప్రభుత్వ ఖజానాకు వెళ్ళాల్సిన నిధులకు 'యు టర్న్' ఇస్తున్న ఏసిపి-టిపిఎస్..?
- టిపిఎస్‌కు ఇద్దరు ప్రైవేటు సిబ్బంది దేనికి..? డిప్యూటీ కమిషనర్..?
- నిర్మాణ చట్టాలకు, నిబంధనలకు తిలోదకాలు ఉన్నతాధికారులకు వాటాలా..?
- పట్టణ ప్రణాళిక అధికారుల చర్యలకు అర్థాలే వేరు..! ఒప్పందంలో భాగమేనా..?
- ఎస్‌టిఎఫ్ చర్యలు..! రుద్ర అక్రమ నిర్మాణానికి వర్తించవా..?ఏసిపి-టిపిఎస్..!
- నోటీసుల జారీతోనే నిలిపివేయాల్సిన నిర్మాణ పనులు..!
- 'సీల్' వేసినా కొనసాగటంలో అర్థం..? ముడుపుల ప్రక్రియ ముగిసిందా..?

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

బీసీల కులగణనపై కేంద్రానికి

చిత్తశుద్ధి లేదు

మంత్రి పొన్నం విమర్శ..

ఈ అంశంపై ప్రధాని మోదీకి లేఖ రాసినట్లు వెల్లడి

హైదరాబాద్ పెన్ పవర్: బీసీల కులగణనపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. బీసీ అని చెప్పుకొంటున్న ప్రధాని మోదీ బీసీ కులగణనపై మాట్లాడటం లేదని ఆయన విమర్శించారు. జనగణనలో బీసీ కులగణన లెక్కలు తేల్చాలని తాను ప్రధానికి లేఖ రాసినట్లు మంత్రి ఆదివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో తెలిపారు. 'దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన మొదటిదశ ఇళ్ల సర్వేలో ఎస్సీ, ఎస్టీల వివరాలు సేకరించారు. ఇక రెండో దశలో బీసీల వివరాలు సేకరిస్తామన్నారు. కానీ రెండోదశ జనగణనకు కేంద్రం విడుదల చేసిన 40ప్రశ్నలలో ఓబీసీ అనే పదాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. ఇది తీవ్ర ఆక్షేపణీయం. తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు రిజర్వేషన్లకు వ్యతిరేకం.

-4లో

దేశం అభివృద్ధి చెందుతుంటే.. రేషన్ లబ్ధిదారులు పెరుగుతారా?

సదస్సులో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్: ప్రపంచంలో ఎక్కడా లేని అభివృద్ధి దేశంలో జరుగుతోందని చెప్పే ప్రధాని.. అదే సమయంలో రేషన్ బియ్యం లబ్ధిదారుల సంఖ్య పెరుగుతోందని చెప్పడం విడ్డూరంగా ఉందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. అందరికీ సామాజిక న్యాయం జరుగుతుంటే రేషన్ బియ్యం తిని బతికేవారి సంఖ్య ఏటా ఎందుకు పెరుగుతోందని ప్రశ్నించారు. '79 ఏళ్ల స్వాతంత్ర్యం – పౌర హక్కులు' అనే అంశంపై ఆదివారం కూకట్‌పల్లి జేఎన్టీయూ ఆడిటోరియంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సామాజిక న్యాయం లేకపోతే సమానత్వం సాధ్యం కాదని.. సమానత్వం లేకుంటే సౌభ్రాతృత్వం సాధ్యం కాదన్నారు. ప్రజల్లో ఆర్థిక వ్యత్యాసాలను క్రమంగా తగ్గించాలనీ.. కానీ, సంక్షేమ పథకాలతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ చర్యలు స్వభావరీత్యా తాత్కాలికమైనవని పేర్కొన్నారు. ఆదేశిక సూత్రాలకు అంతరాయాలు కలిగిస్తే.. అశాంతికి దారి తీసి సమాజం మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, అప్పుడు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకోవడం కష్టమవుతుందని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు.

-4లో

‘రుద్ర’ సీజ్ చేస్తే..!

సెట్‌బ్యాక్‌ల ఆక్రమణ కూల్చేసినట్టేనా..?

సిఎంసి టౌన్‌ప్లానింగ్ వ్యవస్థలో అక్రమ నిర్మాణాలకు అధికారులు బహిరంగంగానే సహకరించడం తీవ్ర చర్చకు దారితీస్తుంది.. మరోవైపు అక్రమ కట్టడాలకు అధికారపార్టీ నాయకుల సిఫార్సులు ఉన్నాయని అధికారులు బహిరంగంగానే చెప్పడం గమనార్హం.. నోటీసులు జారీ, సీజింగ్ వ్యవహారం, అంతా ప్రజలను మభ్యపెట్టే ప్రక్రియగా స్పష్టమవుతుంది.. ముఖ్యంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) పరిధి “దుండిగల్ సర్కిల్-59-నిజాంపేట్ సర్కిల్-58” టౌన్‌ప్లానింగ్ అధికారుల దందా రోజు రోజుకు మితిమీరి పోతుందనే ఆరోపణలు వినవస్తున్నాయి.. టిజి-బిపాస్- బిల్డ్‌నవ్ (ఇన్‌స్టాంట్ అప్రువల్ బిల్డింగ్ పర్మిషన్)చట్టాల తోనే, అక్రమ నిర్మాణాలపై 100 శాతం చర్యలకు ఫుల్‌స్టాప్ పెట్టి, అవినీతి మయంగా తయారైన పట్టణ ప్రణాళిక వ్యవస్థకు.. సిఎంసి ‘ఎస్‌టిఎఫ్’ కమిటీ నియామకం ప్రశ్నలు లేవనెత్తుతోంది.. అధికారుల దందా మరింత బలోపేతం కోసమే ఈ ‘సిఎంసి ఎస్‌టిఎఫ్’ టీమ్ ఏర్పాటు చేశారా..? అంటూ పలువురు వ్యంగ్యారోపణలు చేస్తున్నారు..

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 16:

రుద్ర సీల్ వేసిన మరుసటిరోజు పెన్ పవర్ పేపర్ కటింగ్..

లిహెచ్‌ఎండిఏ నిబంధనలు కొందరికే వర్తిస్తాయని సంబంధిత అధికారులే, పరోక్షంగా నిర్ధారిస్తున్నారు..! బడా నిర్మాణ సంస్థలకు ఈ రూల్స్ వర్తించవని స్పష్టతను ఇస్తున్నారు..? నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి పరిధి బాచుపల్లిలో 200 ఫీట్ల రహదారి పక్కన, బాచుపల్లి సర్వే నెం.135/పార్ట్, 136లో.. ప్లాట్ నెంబర్: 34, 35, 71 అండ్ 72 కు సంబంధించిన, రుద్ర’ కన్‌స్ట్రక్షన్ సంస్థకు చెందిన 1274 గజాల స్థలానికి “డబుల్(2) సెల్లార్ +1 గ్రౌండ్ + 5 పై అంతస్తులకు రెసిడెన్షియల్ (ఇంటికి) అనుమతులు పొందారు.. నిర్మాణానికి ముందు బాగంలో 200 (60 మీటర్లు) అడుగుల రహదారి, వెనుకవైపు 33 అడుగుల (10 మీటర్లు) రోడ్డు ఉన్నట్లు, ప్లాన్ షోయింగ్ స్కెచ్ ప్లాన్‌లో క్లియర్‌గా చూపించారు.. భవనానికి మూడు వైపులా 6 మీటర్లు(చుట్టూ 20 ఫీట్లు) సెట్‌బ్యాకులు.. ముందువైపు దాదాపు 35 ఫీట్లు (10.72 మీటర్లు) వదిలిపెట్టి నిర్మాణం చేపట్టాలి.. అయితే ఈ నిబంధనలు ప్రారంభంలోనే ఉల్లంఘించినా..! నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు మామూళ్ళ మత్తులో పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.. హెచ్‌ఎండిఏ అనుమతులతో ‘రుద్ర’ కన్‌స్ట్రక్షన్ సంస్థ అక్రమ నిర్మాణం చేపడుతుంటే..! అవినీతి అధికారులు, రూ.లక్షలు దండుకుని చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..



రుద్ర అనుమతి మంజూరులో అప్రువల్ స్కెచ్ ప్లాన్..

కొందరు “గెలుపెరుగని” నాయకులు, చట్టబద్ధత లేని ‘సిఫార్సులు’ చేస్తుంటే..!టౌన్‌ప్లానింగ్ అధికారులు అవగాహనా రాహిత్యంతో, నేతల మెప్పు పొందటానికి నిర్మాణ చట్టాలను, నిబంధనలను కాలరాస్తున్నారని, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. చట్టాలను రూపొందించిన వారే, వాటిని విస్మరిస్తే ఏమంటారు..? అధికార దుర్వినియోగమా..? అహంకార పూరిత విధులుగా భావించాలా..? లేకపోతే, మేము అధికారులం.. చట్టాలు సృష్టించాలన్నా..! కాలరాయాలన్నా.. అంతా మా ఇష్టమే.. అన్న ధోరణితో వ్యవహరిస్తున్నారో ఏమో తెలియదు కానీ..! సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ‘సర్కిల్-58- సర్కిల్-59’ టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ పనితీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.. అటు జోనల్ కమిషనర్- ఇటు సిఎంసి కమిషనర్ ఇద్దరూ ‘ఐఏఎస్’ అధికారులే..! అయినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించిన, ప్రమాదకర అక్రమ నిర్మాణాలపై చర్యలకు ఆదేశించాల్సిన సిఎంసి ఉన్నతాధికారులు.. డిప్యూటీ కమిషనర్‌లకు, ‘ఏసిపి-టిపిఎస్’లకు చర్యలు తీసుకోకుండా, సిఎంసి ఉన్నతాధికారులే అనధికారిక ఆదేశాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని చర్చించుకుంటున్నారు.. తెలంగాణలో సిస్టమ్ ఫెయిర్ అయిందనటానికి ఇదే ప్రత్యేక నిదర్శనమని పలువురు ఆరోపణలు చేస్తున్నారు.. ఒకప్పుడు కింది స్థాయి సిబ్బంది వరకే సిఫార్సులు చేసేవారని..! గల్లీ నాయకులు కూడా సిఎంసి కమిషనర్ వరకు సిఫార్సులు చేయడం..! తొండ ముదిరి ఊసరవెల్లి అయిందన్న సామెతను తలపిస్తుందని పలువురు వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు..అక్రమ నిర్మాణాలకు విచ్చలవిడి సిఫార్సులతో, దందా మరింత రెట్టింపు అయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.. అక్రమ భారీ షెడ్లకు రూ.2.5 నుండి 5 లక్షలు.. రెండు పర్మిషన్‌లు కలిపి ఒకటే కమర్షియల్ కాంప్లెక్స్ కడితే రూ.6-7 లక్షలు.. అక్రమ సెల్లార్‌కు ఒకరేటు, అదనపు అంతస్తులకు మరొక రేటు..? ఇలా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం ఈ దందా మూడు పూవులు ఆరు కాయలుగా విరాజిల్లుతోందట.. అందుకే పట్టణ ప్రణాళిక విభాగంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది మొదలుకుని, అధికార యంత్రాంగం పోస్టింగ్‌ల కోసం క్యూ కడుతున్నారట..? వీళ్ళు సమర్పించుకునే తాంబూలం కూడా, అదే స్థాయిలో ఉంటుందనే విమర్శలు వినిపిస్తున్నాయి..

జోనల్ కమిషనర్ సందర్శన ఉద్దేశం..?

రుద్ర కన్‌స్ట్రక్షన్ అక్రమ భవన నిర్మాణానికి నోటీసులు-స్పీకింగ్ ఆర్డర్ తోపాటు, గతనెల 28న అట్టహాసంగా సీలింగ్ ప్రక్రియ కూడా ముగించారు.. మరుసటిరోజే అక్రమార్కులు, టీ-కప్పులో ఈగను తీసేసినట్టు, సీల్ తొలగించి, దర్జాగా పనులు చేస్తున్నారు.. ఈ విషయాన్ని “ట్విట్టర్(ఎక్స్) ద్వారా సంబంధిత అధికారులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళగా.. తీసేసిన సీల్ బ్యానర్ మళ్ళీ ఓ పక్కకు(పనులకు అడ్డులేకుండా) పెట్టి, లోపల పనులు చేస్తున్నారని స్థానికుల ఆరోపణలు.. ఇదిలా ఉండగా, ఈనెల 12న సీజ్‌చేసిన రుద్ర కన్‌స్ట్రక్షన్‌ను కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ తోపాటు ఇంచార్జ్ ఏసిపి శ్రీనివాస్, ఇంచార్జ్ టిపిఎస్ ముఖేష్ సింగ్, సందర్శించారు.. అయితే జోనల్ కమిషనర్ పరిశీలన ఫొటోలు మీడియాకు ఇవ్వకుండా, ఏసిపి-టిపిఎస్ గోప్యంగా పెట్టారు.. అడిగినా ఇవ్వకుండా జాగ్రత్త వహించారని తెలుస్తోంది.. ఎందుకంటే ఆ ఇద్దరి అనుగ్రహంతోనే, రుద్ర కన్‌స్ట్రక్షన్ అక్రమ నిర్మాణం కొనసాగుతోందని సమాచారం.. ఇంతకీ జోనల్ కమిషనర్ సందర్శన ఉద్దేశం..? చర్యలు తీసుకోవడానికా..? ఉనికిని వాడుకోవడానికా..? అన్న ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి..

‘రుద్ర’ కన్‌స్ట్రక్షన్.. అంత ప్రత్యేకమా..?

నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి పరిధిలోని, బాచుపల్లి రుద్ర కన్‌స్ట్రక్షన్ అక్రమ నిర్మాణం ప్రత్యేకతను సంతరించుకుంది.. టౌన్‌ప్లానింగ్ అధికారులే కాదు.. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నుండి సిఎంసి ఉన్నతాధికారుల వరకు, రుద్ర కన్‌స్ట్రక్షన్‌పై ఉదాసీనత చూపడంపై అనుమానాలను రేకెత్తిస్తుంది.. నిర్మాణం చుట్టూ 6 మీటర్లు(20 అడుగులు) సెట్‌బ్యాకులు ఉండాల్సిన చోట ‘జీరో’ సెట్‌బ్యాకులు కళ్ళెదుటే సాక్షాత్కరిస్తుంటే..! అధికారులు చర్యల డ్రామాను రక్తి కట్టిస్తున్నారు.. నోటీసులు- స్పీకింగ్ ఆర్డర్‌లు- సీజింగ్‌తో మమః అనిపిస్తున్నారు.. అంతగా ఒత్తిడి ఉంటే, ఫొటోషూట్ కూల్చివేతలు కూడా చేస్తున్నారు.. ప్రస్తుతం రుద్ర అక్రమ నిర్మాణానికి ‘ఫొటోషూట్’ కూల్చివేతలు మాత్రమే పెండింగ్ ఉన్నాయి.. ఇదంతా కేవలం ప్రజలను మభ్యపెట్టే చర్యలేనని సంబంధిత అక్రమ భవన నిర్మాణాలే నిరూపిస్తున్నాయి.. ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న నిర్మాణాలు అక్కడే పనులు నిలిచిపోయినవి ఉంటే, ఒకటి చెప్పగలరా సిఎంసి, జోనల్ కమిషనర్..? అయినా రుద్ర కన్‌స్ట్రక్షన్ కంపెనీపై, అధికార యంత్రాంగానికి అంత అభిమానం ఎందుకో.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఇందుకోసమేనా..? అక్రమ కట్టడాలపై చర్యలకు తావులేని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ‘ఎస్‌టిఎఫ్’ టీమ్ నియామకం ఎందుకు కమిషనర్ మేడమ్..? చర్యలే తీసుకోకపోతే, టిజి-బిపాస్, బిల్డ్‌నవ్ చట్టాలు ఎందుకు..? టౌన్‌ప్లానింగ్ విభాగం దేనికి..? ఎవరో ఒకరు బకరా దొరికితే తూతూ మంత్రపు చర్యలు చేపట్టి.. రికార్డులు రాసుకుంటారా..? ఎటొచ్చి “పేదలే సమిధలా”..? వాట్ ఏన్ ఐడియా సర్‌జీ..!

బీసీల కులగణనపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదు

-3 పేజి తరువాయి

కులగణనపై భాజపా వైఖరి ఏంటి’ అని మంత్రి ప్రశ్నించారు. ప్రధానికి రాసిన లేఖలో బీసీల కులగణనకు సంబంధించి కీలక సూచనలు చేసినట్లు తెలిపారు. ‘జనాభా లెక్కల ప్రశ్నావళిలో బీసీ కులాలకు స్పష్టమైన ప్రత్యేక కేటగిరీని ఏర్పాటుచేయాలి. 2011 సామాజిక-ఆర్థిక, కులగణనలో కులాల పేర్ల విషయంలో ఎదురైన సమస్యలు 2027జనాభా లెక్కల్లో పునరావృతం కాకుండా పారదర్శక విధానాన్ని అనుసరించాలి. కులాలు, సామాజిక సముదాయాలకు ప్రత్యేక డిజిటల్ కోడ్ కేటాయించాలి’ తదితర సూచనలు చేసినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని.. సభలు, సన్మానాల సమయంలో అతిథులకు జ్ఞాపికలకు బదులు.. చేనేత తువాళ్లను బహూకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో రాష్ట్ర చేనేత శాఖ ఆదివారం నిర్వహించిన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత రంగాన్ని మా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు.

దేశం అభివృద్ధి చెందుతుంటే.. రేషన్ లబ్ధిదారులు పెరుగుతారా?

-3 పేజి తరువాయి

రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ.. ‘సర్’ ప్రక్రియలో నిజంగానే మరణించిన వారు, చొరబాటుదారులు, డూప్లికేట్ ఓటర్లనే తొలగిస్తున్నారా..? అని ప్రశ్నించారు. ఓటు పోయినవారు సంఘాలు ఏర్పాటు చేసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ డీజీ నర్సింహారావు, కోకన్వీనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఆనందం దుర్గాప్రసాద్‌కు జాతీయస్థాయి ఉత్తమ గ్రంథపాలక అవార్డు

హైదరాబాద్ పెన్ పవర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్‌నగర్‌లో గ్రంథపాలకుడిగా సేవలందిస్తున్న డాక్టర్ ఆనందం దుర్గాప్రసాద్‌కు జాతీయస్థాయి ఉత్తమ గ్రంథపాలక అవార్డు--2026 లభించింది. మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్, చెన్నై ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. విద్యా శాఖ మంత్రి తిరు రాజా మోహన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కళ్యాణ సుందరం, మద్రాస్ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్మ్‌స్ట్రాంగ్, ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ దొరస్వామి తదితర ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. విద్యార్థులకు గ్రంథాలయ సేవలను చేరువ చేయడంతో పాటు డిజిటల్ వనరుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, విద్యా, ఉద్యోగ, పోటీ పరీక్షలు, పరిశోధన సమాచారాన్ని అందించడంలో దుర్గాప్రసాద్ విశేష కృషి చేస్తున్నారు. ముఖ్యంగా 'ఈ-లైబ్రరీ తెలంగాణ' బ్లాగ్ ద్వారా 146 దేశాల పాఠకులకు సమాచారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 17 లక్షల మంది బ్లాగ్‌ను

వీక్షించారని పేర్కొన్నారు. ఆయన సేవలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించడం కళాశాలతో పాటు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. సురేష్‌బాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, గ్రంథపాలకులు, బంధువులు, మిత్రులు అభినందించారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

విద్యార్థులకు చేయూత.. ప్లేట్లు, పెన్నుల పంపిణీ

గౌరారం పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

హైదరాబాద్ పెన్ పవర్: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్లేట్లు, పెన్నులు పంపిణీ చేశారు. పిట్లం రిటైర్డ్ ఉపాధ్యాయులు దయానంద్ విద్యార్థులకు ప్లేట్లు వితరణ చేయగా, వార్డు సభ్యులు మారుతి పెన్నులు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంత్ రావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జే. శంకర్, ఉప సర్పంచ్ దొడ్ల హన్మండ్లు ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జొనిట వివాహ విందుకు సీఎం రేవంత్ రెడ్డి హాజరు

వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి

అంగరంగవైభవంగా వివాహ వేడుక

హైదరాబాద్ పెన్ పవర్:

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె జొనిట వివాహ విందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఘన స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్ రావు, సంజీవ్ రెడ్డి, ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు అశేష జనవాహిని తదితరులు పాల్గొన్నారు.

తీజ్ పండగ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాల ప్రతిబింబం - మాజీ జెడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందు

హైదరాబాద్ పెన్ పవర్: మండల కేంద్రంలో తీజ్ పండుగ ఉత్సవ కమిటీ వారు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పి చైర్మన్ ఆంగోతు బిందు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిందు మాట్లాడుతూ తీజ్ పండుగ అనేది గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రకృతి పండుగ అని పేర్కొన్నారు. ముఖ్యంగా పెండ్లి కాని లంబాడి యువతులు ఈ పండుగను ప్రత్యేకంగా నిర్వహిస్తారని తెలిపారు.

తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ తీజ్ పండుగలో గోధుమలను బుట్టల్లో చల్లి, వాటికి నీళ్లు పోస్తూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. సేవాలాల్ మహారాజ్, మేరమ్మా యాడిని ఆరాధిస్తూ ఈ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు.

బంజారా సమాజం యొక్క సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందించడంలో తీజ్ పండుగకు ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, అజ్మీర రూప్లా, భూక్య రవి నాయక్, జరుపుల శ్రీను, భూక్య రమేష్, కిషన్, గోపాల్, ఎంఈఓ లక్ష్మణ్, బాల్య తండా సర్పంచ్ అజ్మీర దేవోజి, రాంబాబు, నరేష్, రాందాస్, చిన్న, ప్రసాద్, మహిళలు, యువతులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం (బౌరమ్మగుడి), శ్రీ శ్రీ భౌరంపేట్ బంగారమ్మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు.. ...

హైదరాబాద్ పెన్ పవర్:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ లో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి (బౌరమ్మగుడి) ఆలయ వార్షికోత్సవం మరియు శ్రీ శ్రీ భౌరంపేట్ బంగారు మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాల సందర్భంగా ఈరోజు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు రెండు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ భౌరంపేట్ బంగారు మైసమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం, అభివృద్ధి వెల్లివిరియాలని స్వామివారిని, అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ

కార్యక్రమాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు జిన్నారం వెంకటేష్ గౌడ్ , మేడ్చల్ జిల్లా గ్రంథాలయం సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలీస్ గోవింద్ రెడ్డి, భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి , బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాచారం మురళీ యాదవ్ , ఆలయ కమిటీ అధ్యక్షులు యాదిరెడ్డి మరియు తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సేవా పతకాలు అందుకున్న పోలీసు అధికారులకు బండి సంజయ్ అభినందనలు..

హైదరాబాద్ పెన్ పవర్: ఉత్తమ సవలకు రాష్ట్ర ప్రభుత్వం సేవా పతకాలతో సత్కరించిన ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అభినందించారు. ఇబ్రహీంపట్నంలో ఎస్ఎస్‌బీ, ఎన్ఎస్‌జీ సిబ్బంది కోసం నిర్మించిన నూతన ఫ్యామిలీ క్వార్టర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు, ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డిలను కలుసుకున్న ఆయన.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వారి సేవలను గుర్తించి పతకాలతో సత్కరించిన విషయం తెలుసుకుని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు ప్రజలకు మరింత చేరువగా ఉంటూ సేవా దృక్పథంతో పనిచేయాలని బండి సంజయ్ సూచించారు. ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తూ పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని అన్నారు. అంకితభావంతో విధులు నిర్వహించి శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మంత్రి అభినందనలపై ఏసీపీ రాజు, ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

నూతన వధువు పావని కుమారిని ఆశీర్వదించిన ఇన్చార్జి డాక్టర్ దద్దాల

హైదరాబాద్ పెన్ పవర్: హనుమంతునిపాడు మండలంలోని మోరవారిపల్లి గ్రామంలో వైఎస్ఆర్సిపి నాయకులు యర్రంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి - వసంత దంపతుల కుమార్తె పావని కుమారి వివాహ వేడుకలో కనిగిరి నియోజకవర్గం వైఎస్ఆర్ సీపీ ఇంచార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని నూతన వధువును ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకలో మండల పార్టీ అధ్యక్షులు యక్కంటి శ్రీనివాసరెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు మద్ది తిరుపతయ్య, సానికొమ్ము మధుసూదన్ రెడ్డి, మండల ప్రచార కమిటీ అధ్యక్షులు కలికాయి నారాయణ, జయరామిరెడ్డి, ఆంజనేయులు, లక్ష్మి రెడ్డి, నాగార్జున రెడ్డి, కె. వెంకటేశ్వర రెడ్డి, మండల పార్టీ నాయకులు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుపై మోదీ బొమ్మ వేయాల్సిందే-తుమ్మల శ్రీనివాస్ రావు.

హైదరాబాద్ పెన్ పవర్:

తెలంగాణలోని పంపిణి చేస్తున్న రేషన్ కార్డులపై ప్రధాని మోదీ బొమ్మ వేయాల్సిందేనని బీజేపీ పార్టీ బయ్యారం మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం అర్హులైన వారికి రేషన్ కార్డులు పంపిణీ చేపట్టానున్న నేపథ్యంలో రేషన్ కార్డులపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిల ఫొటోలు మాత్రమే ప్రింట్ చెయ్యడంపై బీజేపీ పార్టీ బయ్యారం మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు స్పందించారు. తెలంగాణలో రేషన్ కార్డు వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం కిలో బియ్యం మాత్రమే ఇస్తోందని, కానీ కేంద్ర ప్రభుత్వం 5 కిలోలు ఇస్తోందని గుర్తు చేశారు. ఎక్కువ బియ్యం కేంద్రం ఇస్తున్నప్పుడు మోదీ ఫొటో వేయకుండా కార్డులు ఎలా పంపిణీ చేస్తారని శ్రీనివాస్ రావు ప్రశ్నిస్తున్నారు. మోదీ ఫొటో వేశాకే రేషన్ కార్డుల పంపిణీ చెయ్యాలని, అప్పటి దాకా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. అలాగే మోదీ ఫొటో లేకుండా కార్డుల పంపిణీ చేపడితే పార్టీ తరపున నిరసన కార్యక్రమాలు చేపడుతామని తుమ్మల ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఐలయ్యకు వందే భారత్ జాతీయ సమైక్యత అవార్డు

అవార్డు అందుకుంటున్న విశ్రాంతి ఉపాధ్యాయుడు ఐలయ్య

గార్ల, పెన్ పవర్, ఆగస్టు 16: మహబూబాబాద్ జిల్లా గార్ల కు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు, కవి రచయిత పంజాల ఐలయ్యకు వందే భారత్ జాతీయ సమైక్యత అవార్డు–2026 లభించింది. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆనందలహరి సంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. సాహిత్య రంగంలో చేస్తున్న కృషికి గాను జాతీయ సమైక్యత పురస్కారానికి ఎంపిక చేశారు. ముఖ్య అతిథులు ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, వంశీ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కా ను వెంకటరమణ సినీ నటులు జెన్నీ , ఏసిపి నరేష్ రెడ్డి చేతుల మీదుగా జాతీయ సమైక్యత పురస్కారాన్ని అందజేశారు. ఈ సభకు వందే భారత్ మూవీ డైరెక్టర్ మల్లం రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అవార్డుతోపాటు ప్రశంస పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లతో యువతకు నైపుణ్య శిక్షణ.. మెరుగైన ఉద్యోగ అవకాశాలు

హైదరాబాద్ పెన్ పవర్: మారుమూల ప్రాంతాల్లోని యువతకు సైతం ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీస్, గనులు, భూగర్భ శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండలం పల్లమర్రి గ్రామంలో ఎర్నాల ఎర్రగట్టు వద్ద అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌కు స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి తో కలిసి మంత్రి వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధునిక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగానే యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పల్లమర్రి ప్రాంతానికి త్వరలో బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతానికి రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, తద్వారా చుట్టుపక్కల గ్రామాల యువత కూడా ఏ టి సి కేంద్రానికి చేరుకుని నైపుణ్య శిక్షణ పొందే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు మారుమూల ప్రాంతాలకు చేరినప్పుడే అక్కడి ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని అన్నారు. నిర్మాణ రంగంతో పాటు మేస్త్రీలు, టైల్స్ పనివారు, ఎలక్ట్రీషియన్లు వంటి వివిధ వృత్తి నిపుణులకు కూడా ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.

యువతకు నైపుణ్యమే భవిష్యత్‌కు బాట

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని మంత్రి అన్నారు. సాధారణంగా రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వచ్చే ఉద్యోగాలకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని అధిక వేతనాలు పొందేలా యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాల భర్తీ దిశగా ముందుకు సాగుతోందని, ఇప్పటికే సుమారు లక్ష ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. ఇందులో సుమారు 50 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు, వైద్య రంగంలో అవసరాలకు అనుగుణంగా సుమారు 10 వేల నర్సింగ్ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు వివరించారు.

మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా శిక్షణ

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో యువత కూడా కొత్త టెక్నాలజీలను నేర్చుకోవాలని మంత్రి సూచించారు. ఒకప్పుడు వార్తల కోసం పత్రికలపై ఆధారపడగా, తర్వాత టెలివిజన్, ప్రస్తుతం సోషల్ మీడియా ప్రధాన సమాచార వేదికలుగా మారాయని అన్నారు అదేవిధంగా ఆటోమొబైల్ రంగంలో పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి ఎలక్ట్రిక్ వాహనాల దిశగా మార్పు జరుగుతోందని, ఈ మార్పులకు అనుగుణంగా యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

రూ.4 వేల కోట్లతో 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు

రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.4 వేల కోట్ల వ్యయంతో 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో ఉన్న 65 ఐటీఐలను కూడా ఆధునీకరించి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ కేంద్రాల్లో ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ, రోబోటిక్స్, జచిజ మెషిన్ ఆపరేషన్ వంటి ఆధునిక కోర్సుల్లో శిక్షణ అందిస్తామని తెలిపారు.

వ్యవసాయ రంగంలోనూ ఆధునిక పద్ధతులు, అగ్రో ప్రాసెసింగ్ వంటి అంశాల్లో శిక్షణ పొందే అవకాశాలు ఉంటాయని చెప్పారు.

విదేశాల్లోనూ మెరుగైన ఉపాధి అవకాశాలు

ఆధునిక నైపుణ్యాలతో పాటు విదేశీ భాషలను నేర్చుకుంటే జర్మనీ, జపాన్, యూరప్ తదితర దేశాల్లో కూడా మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని మంత్రి అన్నారు. ఆయా దేశాల్లో ఉద్యోగాలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలతో పాటు జర్మన్, జపనీస్ వంటి భాషల్లో శిక్షణ పొందాలని యువతకు సూచించారు.ఏ టి సి కేంద్రాల్లో శిక్షణ పొందిన యువతకు విదేశాల్లో కూడా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వచ్చే ఏడాది తాను తిరిగి ఈ ప్రాంతానికి వచ్చే సమయానికి కనీసం 100 మంది యువతకు శిక్షణ అందించి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. జపాన్‌లోనూ నైపుణ్యం కలిగిన ఇంజనీర్లకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

శిక్షణ పొందే విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైఫండ్

పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువతకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా శిక్షణ పొందే అవకాశం కల్పించేందుకు ాూజ కేంద్రాల్లో శిక్షణ పొందే విద్యార్థులకు ప్రభుత్వం నెలకు రూ.2,000 స్టైఫండ్ అందించాలని నిర్ణయించిందని మంత్రి తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిక్షణను పూర్తి చేసి ఉద్యోగాలు పొందాలని, గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను నైపుణ్య శిక్షణ వైపు ప్రోత్సహించాలని ఆయన కోరారు. కష్టపడి చదివి, ఆధునిక నైపుణ్యాలు నేర్చుకుని, విదేశీ భాషలను అభ్యసిస్తే అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు పొందడంతో పాటు కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవచ్చని మంత్రి అన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న ఏటిసి 100 మంది విద్యార్థులతో విజయవంతంగా నడిపిస్తే, వచ్చే సంవత్సరం మరొక ఏటీసీ సెంటర్ మంజూరు చేస్తామని మంత్రి అన్నారు.అలాగే దేవరకద్ర నియోజకవర్గంలో బీడీ కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున వారి ఆరోగ్య పరిరక్షణ కొరకు ఈఎస్ఐ డిస్పెన్సరీ మంజూరు సంబంధించిన ప్రతిపాదనలు సంబంధిత శాఖ కార్యదర్శి కి పంపడం జరిగిందని అన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, దేవరకద్ర నియోజకవర్గం సి.సి. కుంటలో 43. 4 కోట్ల రూపాయలతో ఏ.టి.సి సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నందుకు మంత్రి వివేక వెంకట్ స్వామి కి కృతజ్ఞతలు తెలిపారు. ఏటీసీ సెంటర్ ద్వారా ఇక్కడున్న యువతకు పదవ తరగతి తర్వాత నైపుణ్య శిక్షణ అందుకునేందుకు వీలుగా ఉంటుందని అన్నారు. ఏ టి సి ద్వారా విద్యార్థులకు ఆరు విభాగాలలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అందిస్తారని ఆయన అన్నారు. దీనిని సద్వినియోగం చేసుకొని రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ కర్మాగారం, ఇతర పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలను యువత పొందే అవకాశం ఉందని ఆయన అన్నారు.గత రెండున్నర సంవత్సరాలలో దేవరకద్ర నియోజకవర్గానికి అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు అనేక కార్యక్రమాలు తీసుకుంటున్నామని అన్నారు.నియోజకవర్గంలో ఒక డిగ్రీ కళాశాల ఏర్పాటు, చిన్న చింతకుంటలో జూనియర్ కళాశాల, అలాగే దమగ్నాపూర్ గ్రామంలో 200 కోట్ల రూపాయల తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, దేవరకద్ర మండల కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, సివిల్ జడ్జి కోర్టు, నియోజకవర్గంలో త్వరలోనే బ్రహ్మోస్ మిసైల్ తయారీ కర్మాగారం, అలాగే భూత్పూర్ మండలంలో మిధాని కర్మాగారం ఏర్పాటుకు సంబంధించిన భూ సేకరణ కార్యక్రమాలను వేగవంతం చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. గత పది ఏళ్ల బి.ఆర్.ఎస్ ప్రభుత్వం లో దేవరకద్ర నియోజకవర్గాన్ని అన్ని విధాల నిర్లక్ష్యం చేశారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రెండున్నర సంవత్సరాలలో ఒక్క చిన్న చింతకుంట మండలంలోనే 450 కోట్ల రూపాయల అభివృద్ధి పనులను చేపట్టినట్టు ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంకా అనేక కార్యక్రమాలను చేపట్టి దేవరకద్ర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శగా నియోజకవర్గంగా తయారు చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రాష్ట్ర ఉపాధి, శిక్షణ సంస్థ డైరెక్టర్ రాజేష్, జాయింట్ డైరెక్టర్ నరేష్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ సీతారాములు, జిల్లా ఉపాధి కల్పన అధికారి మైత్రి ప్రియ, తహసీల్దార్ ఎల్లన్న, మహమ్మద్ అల్తాఫ్ అసిస్టెంట్ కమిషనర్ లేబర్, ఎం.పి.డి.ఓ అనురాధ, కురుమూర్తి స్వామి చైర్మన్ బత్తుల బాలరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ పల్లమర్రి సర్పంచ్ ఏ. లక్ష్మి, ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అతిపెద్ద మట్టిగణపతి.. ఈసారి నాగోల్‌లో..

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణలో వినాయకచవితి నవరాత్రుల వేడుకలు ఏస్థాయిలో జరుగుతాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ముఖ్యంగా హైదరాబాద్ గణేష్ చతుర్థి నవరాత్రోత్సవాలకు పెట్టింది పేరు. గల్లీ గల్లీకి కనీసం రెండుమూడు గణేషుడి మండపాలైనా దర్శనమిస్తాయి. రకరకాల థీమ్స్ లో గణేషులను ప్రత్యేకంగా తయారు చేయించి మరీ.. ఘనంగా నవరాత్రోత్సవాలను నిర్వహిస్తారు.ఇక హైదరాబాద్ లో వినాయకచవితి ఉత్సవాలనగానే.. అందరికీ ఖైరతాబాద్ గణేషుడే గుర్తొస్తారు. భారీ రూపాన్ని దర్శించుకునేందుకు నగర నలుమూలల నుంచే కాదు.. తెలుగు రాష్ట్రాల నుంచి అనేకమంది ఈ ప్రాంతానికి క్యూ కడతారు. 11 రోజులపాటు నిర్వహించే గణేష్ చతుర్థి ఉత్సవాలతో ఖైరతాబాద్ ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసిపోయి ఉంటుంది. ఈ ఏడాది ఖైరతాబాద్ గణేషుడిని 69 అడుగుల ఎత్తులో పంచముఖ సంకటహర మహా గణపతి థీమ్ తో రూపొందిస్తున్నారు. అయితే ఈసారి ఖైరతాబాద్ గణేషుడిని మించిన ఎత్తుతో నాగోల్ లో మహా మట్టిగణపతి కొలువుదీరుతున్నాడు. నాగోల్ లోని తిరంగ్ యూత్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం ఆసక్తిని రేకెత్తిస్తోంది. పదేళ్లుగా ఈ అసోసియేషన్ మట్టి విగ్రహాన్నే ఏర్పాటు చేయిస్తుండగా.. ఈసారి ఏకంగా 72 అడుగుల భారీ మట్టి గణపతిని తయారు చేయిస్తున్నారు. అష్టసిద్ధి మహాగణపతిగా కొలువుదీరుతున్న ఈ ఏకదంతుడు ఈసారి భాగ్యనగరంలో అతిపెద్ద గణేషుడు కావడం విశేషం. విగ్రహంపై ఏడు విభిన్న రూపాల్లో చిన్న

గణేషుల ప్రతిమలను రూపొందిస్తున్నారు. నెలరోజులుగా 21 మందికిపైగా కార్మికులు విగ్రహ తయారీలో నిమగ్నమయ్యారు. పర్యావరణాన్ని కాపాడుతూ.. కేవలం మట్టి విగ్రహాలను మాత్రమే పూజించాలని అందరికీ చాటిచెప్పడమే లక్ష్యంగా ఈ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మరో 30 రోజుల్లో విగ్రహ నిర్మాణం పూర్తవుతుందని, పండుగకు మూడురోజుల ముందునుంచే స్వామివారి దర్శనాన్ని కల్పిస్తామని వెల్లడించారు.

ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీవో మంగమ్మ

గార్ల, పెన్ పవర్, ఆగస్టు 16: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గార్ల ఎంపీడీవో ఎం. మంగమ్మ కోరారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.గార్ల మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను సంబంధిత అధికారులకు నేరుగా సమర్పించవచ్చన్నారు.ప్రజల నుంచి అందే వినతులను పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు 24 శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు ప్రజావాణిలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలతో నిర్దేశిత సమయంలో వినతులు సమర్పించాలని సూచించారు.మండల ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు వేగవంతమైన పరిష్కారం పొందాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం: ఏఈ

గార్ల, పెన్ పవర్, ఆగస్టు 16: మహబూబాబాద్ జిల్లా గార్ల మండల పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో 33కెవి లైన్ లో టవర్లు ఏర్పాటు కొరకు సోమవారం ఉదయం 6 గంటల నుండి 10.30 వరకు సత్యనారాయణపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ముల్కనూరు మద్దివంచ, పెద్ద కిస్టాపురం, చిన్న కిస్టాపురం అంజనాపురం, సీతంపేట, శేరి పురం, అంకన్నగూడెం గ్రామాలకు విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ మధు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, వ్యాపారస్తులు విద్యుత్ అసౌకర్యాన్ని గమనించాలని సూచించారు.

ఏ ఈ మధు

భక్తి శ్రద్ధలతో తీజ్ వేడుకలు

ఆకట్టుకుంటున్న సంప్రదాయ నృత్యాలు

పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

గార్ల, పెన్ పవర్, ఆగస్టు 16: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం చిన్నకిష్టాపురం గ్రామపంచాయతీ పరిధిలోని దేశ్య తండాలో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న తీజ్ పండుగ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగాయి. తీజ్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్న సందర్భంగా గిరిజన భక్తజనం సంత్ సేవాలాల్ మహారాజ్, మేరమా యాడీలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండాలని, గ్రామాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, పెళ్లికాని యువతీ యువకులకు మంచి సంబంధాలు కుదరాలని, ప్రపంచ శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తీజ్ పండుగలో భాగంగా తొమ్మిది రోజుల పాటు సంప్రదాయబద్ధంగా నిర్వహించిన కార్యక్రమాలతో తండాలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.ఈ కార్యక్రమానికి తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గంగావత్ శ్రీనివాస్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను తరతరాలకు అందించడంలో తీజ్ పండుగకు విశిష్ట స్థానం ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రుక్మిణి హరికిషన్ నాయక్, సేవాలాల్ సేన వార్డు సభ్యుడు గంగావత్ కిషన్, మాన్సింగ్, సురేష్, గంగావత్ భీక్యా, ధర్మసోత్ లక్ష్మణ్, రవి భీముడు, మేఘా భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల అధ్యక్షుడికి మాతృవియోగం

గార్ల, పెన్ పవర్, ఆగస్టు 16: టీఎస్ యుటిఎఫ్ మహబూబాబాద్ జిల్లా గార్ల మండల అధ్యక్షుడు మాచర్ల సుందర్ కుమార్ కు మాతృవియోగం జరిగింది. మండల కేంద్రంలోని వర్తక సంఘం బజార్ కు చెందిన మాచర్ల కాంతమ్మ (80) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. కాంతమ్మ మృతిదేహం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి,పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, యుటిఎఫ్ జిల్లా నాయకులు జి భద్రునాయక్, మండల కార్యదర్శి షరీఫ్, జడ్పిఎస్ఎస్ బాలికల పాఠశాల హెచ్ఎం డి.సత్యనారాయణ తదితరులు పాల్గొని పూలమాలలతో నివాళులర్పించారు. కాంతమ్మ కుమారులు మాచర్ల సంపత్ కుమార్, మాచర్ల శశి కుమార్, మాచర్ల సుందర్ కుమార్, మాచర్ల స్వర్ణ కుమార్ లను ఓదార్చి మనోధైర్యం అందించారు.

కాంతమ్మ

‘దిమాగీ నక్సల్స్’ అంటారా?.. పేర్లు పెట్టడం ఆపి స్కూళ్లను బాగుచేయండి: ప్రకాశ్ రాజ్ ఫైర్

హైదరాబాద్ పెన్ పవర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ అత్యున్నత నాయకుడు చేసిన ‘దిమాగీ నక్సల్స్’ వ్యాఖ్యలపై ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ తీవ్ర స్థాయిలో స్పందించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని వేధించే వారికి, క్షేత్ర స్థాయిలో ఉన్న ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే వారికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియోను విడుదల చేశారు.

పేర్లు పెట్టడం కాదు.. సమస్యలు చూడండి..

‘స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఇద్దరు వ్యక్తులు తమ పని తాము చేయడం మనం చూశాం. అందులో ఒకరు దేశ అత్యున్నత నాయకుడు. ప్రభుత్వాన్ని నిలదీస్తూ, జవాబుదారీతనం కోసం కఠినమైన ప్రశ్నలు అడిగే వారికి మెదడు (దిమాక్) ఉందని ఆయన ఎట్టకేలకు అంగీకరించారు. ఇన్నాళ్లు వారిని అర్బన్ నక్సల్స్, అభివృద్ధి నిరోధకులు, పురుగులు అని పిలిచిన ఆయన.. ఇప్పుడు కొత్తగా వారికి ‘దిమాకీ నక్సల్స్’ అని నామకరణం చేశారు. మరోవైపు, ఆ ‘దిమాగీ నక్సల్స్’ అని ముద్రవేయబడిన యువకులు.. పల్లెల్లోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి అక్కడ మరుగుదొడ్లు, ఉపాధ్యాయులు, కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తెస్తున్నారు.’ అని పేర్కొన్నారు.

నాయకుడికి నా సూచన ఇదే..

‘ఇక నాయకుడికి నా సూచన ఏమిటంటే.. ఎర్రకోటను కేవలం ఇలా పేర్లు పెట్టడానికి ఉపయోగించడం మానేయండి. దేశం ఎదుర్కొంటున్న నిజమైన సమస్యలపై దృష్టి పెట్టండి. ప్రభుత్వ స్కూళ్లను మూసివేయడం ఆపి, మెరుగైన తరగతి గదులు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సరిపడా ఉపాధ్యాయులను ఏర్పాటు చేయండి. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు అద్భుతమైన వాతావరణాన్ని కల్పించి వారి భవిష్యత్తును కాపాడండి. అధికారంలో మీకు ఇంకా కొన్ని సంవత్సరాల సమయం మిగిలి ఉంది కాబట్టి, ఈ ప్రజా సమస్యలపై మీరు ఏదైనా చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను. జస్ట్ ఆస్కింగ్ (కేవలం అడుగుతున్నానంతే).’ అని ప్రకాశ్ రాజ్ తన వీడియోలో పేర్కొన్నారు.

పరకాల సీఎం పర్యటనలో కనిపించని కొండా సురేఖ.. రేవూరికి ఛాన్స్ ఇచ్చిన రేవంత్

హైదరాబాద్ పెన్ పవర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన ముగిసింది. జిల్లాలో జరిగిన అన్ని కార్యక్రమాలు గ్రాండ్‌గా జరిగింది. పరకాలలో నిర్వహించిన సభలో అయతే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ నేతలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ రేంజ్‌లో విరుచుకుపడ్డారు.అయితే ఆ కార్యక్రమంలో ఓ వ్యక్తి మిస్సైయ్యారు. ఆమె కొండా సురేఖ. ప్రస్తుతం దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్నారు. సీఎం మేడారం పనుల పరిశీలనలోనూ కొండా సురేఖ లేరు. అనంతరం పరకాలలో నిర్వహించిన సభలోనూ ఆమె కనిపించలేదు. ఇందుకు కారణం ఆమె కూతురేనట. వచ్చే ఎన్నికల్లో తన కూతురు సుస్మిత పోటీ చేస్తుందని ఇప్పటికే కొండా సురేఖ ప్రకటించారు. ఈ మేరకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఈ స్థానంలో రేవూరి ప్రకాశ్ రెడ్డికి అవకాశం కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే అటు రేవూరి కూడా చెప్పారు. అంతేకాదు పరాకాల సభలో రేవూరును ఆశీర్వదించాలని ప్రజలకు సైతం పిలుపునిచ్చారు. దీంతో పరకాల కాంగ్రెస్‌లో కొండా సురేఖ అంశంపై చర్చ మొదలైంది.

హైదరాబాద్ సిటీ పోలీస్‌లో కొలువులు.. 150 ఎస్పీఓ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగంలో ఖాళీగా ఉన్న 150 ప్రత్యేక పోలీసు అధికారులు పోస్టులను పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం మాజీ సైనికులు, మాజీ పారామిలటరీ బలగాలు, రిటైర్డ్ పోలీసు సిబ్బంది నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. మాజీ సైనికుల వయస్సు 31-08-2026 నాటికి 58 సంవత్సరాల కంటే తక్కువ ఉండాలి. మాజీ పారామిలటరీ, రిటైర్డ్ పోలీసు సిబ్బంది పదవీ విరమణ పొందిన తర్వాత రెండు సంవత్సరాల లోపు వారై ఉండాలి. వీరికి గరిష్ట వయోపరిమితి 62 సంవత్సరాలుగా నిర్ణయించారు.

నెలకు రూ.26,000 గౌరవ వేతనం..

ఎంపికైన వారికి నెలకు రూ.26,000 గౌరవ వేతనంగా చెల్లిస్తారు. ఎలాంటి వేతనంతో కూడిన సెలవులు ఉండవు. అయితే అత్యవసర సమయంలో వేతనం చెల్లింపు లేకుండా సెలవులు మంజూరు చేస్తారు.

అవసరమైన పత్రాలు..

అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలి. డిశ్చార్జ్ బుక్/డిశ్చార్జ్ సర్టిఫికేట్/రిటైర్మెంట్ ఆర్డర్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఎస్‌బీఐ పాస్‌బుక్ జిరాక్స్, ఓటరు గుర్తింపు కార్డు, కుల ధృవీకరణ పత్రం, టెక్నికల్ ట్రేడ్ ప్రొఫిషియన్సీ సర్టిఫికెట్ సమర్పించాలి. డ్రైవర్ అభ్యర్థులకు చెల్లుబాటు అయ్యే LMV/HMV డ్రైవింగ్ లైసెన్స్ అవసరం. అలాగే మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు సమర్పించాలి.

దరఖాస్తు సమర్పణ విధానం- చివరి గడువు

ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు అవసరమైన పత్రాలతో హైదరాబాద్ పెట్లబుర్జ్‌లోని జూ= హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న ఖాూం కార్యాలయంలో వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను 25-08-2026 సాయంత్రం 5:00 గంటల లోపు సమర్పించాలి. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని అధికారులు స్పష్టం చేశారు.

హైదరాబాద్‌తో సమానంగా ములుగు అభివృద్ధి : మంత్రి సీతక్క

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ తో సమానంగా ములుగు అభివృద్ధి చెందుతోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ములుగు జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తున్నారు. మేడారం వద్ద సమ్మక్క - సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు, తులాభారం నిర్వహించి.. మొక్కులు తీర్చుకున్న అనంతరం.. ములుగు జిల్లా నూతన కలెక్టరేట్ ను ఆయన ప్రారంభించారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గతంలో ములుగు అంటే అడవులు, అభివృద్ధి లేని ప్రాంతంగా చూసేవారని గుర్తుచేసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక.. ములుగు అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ములుగు జిల్లా కోసం 10 ఏళ్లు కొట్లాడితే.. 33వ జిల్లాగా ఇచ్చారన్నారు. ఎన్నికలకు ముందే ములుగు కలెక్టరేట్ కు శంకుస్థాపన జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కలెక్టరేట్ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసిందన్నారు. ఏడాది కాలంలో సమ్మక్క - సారలమ్మలను దర్శించుకున్న ఏకైక సీఎం.. రేవంత్ రెడ్డి ఒక్కరేనన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాకూ ఇవ్వనన్ని ఇందిరమ్మ ఇళ్లను ములుగు జిల్లాకు ఇచ్చారని సీతక్క తెలిపారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
‘పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

తొలిసారి ఈవీఎం కాదా..బ్యాలెట్ తోనేనా ?

హైదరాబాద్ పెన్ పవర్: ఏపీలో వేలాదిగా ఉన్న పంచాయతీలకు ఎన్నికలు తొందరలో జరగనున్నాయి. ప్రజా పాలన లేక ఇప్పటికే అయిదు నెలలు గడచిపోయాయి. మరో రెండు నెలలలో స్థానిక ఎన్నికలు ఉన్నాయి. దాంతో ఎంత తొందరగా ఎన్నికలు జరిపించాలన్నది ప్రభుత్వం ఆలోచిస్తోంది. అలాగే రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికలు సజావుగా నిర్వహించాలని చూస్తోంది. ఆ దిశగా సన్నాహాలు కూడా ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాలెట్ తో ఎన్నికలు అంటూ ఇపుడు కొత్త మాట వినిపిస్తోంది. నిజానికి ఈవీఎంలు గడచిన రెండు దశాబ్దాలుగా వినియోగంలోకి వచ్చాయి. అయితే ఈసారి పంచాయతీ ఎన్నికలను కూడా బ్యాలెట్ పేపర్ విధానంలోనే జరిపించాలని ఎన్నికల సంఘం ఆలోచన చేస్తోంది అని అంటున్నారు.

గతంలోనూ బ్యాలెట్ పేపర్ తోనే :

ఇదిలా ఉంటే ఏపీలో 2021లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలని కూడా ఈవీఎంలతో నిర్వహించలేదు. వాటిని సంప్రదాయ బ్యాలెట్ పేపర్లతోనే చేపట్టారు. 2021 ఫిబ్రవరిలో జరిగిన ఏపీ గ్రామ పంచాయతీ ఎన్నికల పూర్తి షెడ్యూల్ ప్రకారం ఓటింగ్ ప్రక్రియ అంతా బ్యాలెట్ పేపర్ల మీదే సాగింది. అదే విధంగా సర్పంచ్ వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులకు బ్యాలెట్ పేపర్ పై ముద్రించిన వివిధ రకాల గుర్తులను కేటాయించారు. ఇక పోలింగ్ ముగిసిన వెంటనే పోలింగ్ కేంద్రాల్లోనే బ్యాలెట్ బాక్సులను తెరిచి ఓట్ల లెక్కింపు పూర్తి చేశారు. అలాగే 2021లో ఏపీలో జరిగిన ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలు కూడా ఈవీఎంల ద్వారా జరగలేదు. ఈ ఎన్నికలను పూర్తిగా బ్యాలెట్ పేపర్లు తోనే నిర్వహించారు. ఇప్పటిదాకా ఏపీలో మున్సిపల్ కార్పొరేషన్లు మున్సిపాలిటీ ఎన్నికలకు మాత్రమే ఈవీఎంలను ఉపయోగిస్తూ వచ్చారు.

తొలిసారి ఈవీఎంలు అంటూ :

ఈ నేపథ్యంలో ఏపీలో గ్రామ పంచాయతీ ఎన్నికలను తొలిసారి ఈవీఎంలతో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావించింది. కానీ చివరికి బ్యాలెట్ విధానానికే మొగ్గ చూపినట్లు సామాజిక మాధ్యమాలలో అయితే విస్తృత ప్రచారం జరుగుతోంది. దాంతో పాటు గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపల్ ఎన్నికలనూ బ్యాలెట్ విధానంలో నిర్వహించేందుకు ప్రణాళిక అంటూ పోస్ట్ లు వైరల్ అవుతున్నాయి. ఇక రాష్ట్రంలో అందుబాటులో లక్ష పది వేల బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయని అంటున్నారు. వీటిలో కూడా యాభై వేల బ్యాలెట్ బాక్స్ లు మాత్రమే వినియోగానికి చాన్స్ ఉన్నట్లుగా చెబుతునారు. ఈ క్రమంలో అదనంగా 50 వేల చొప్పున బాక్సులు సమకూర్చాలని తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక ఎన్నికల కమిషన్లకు అధికారులు రాష్ట్ర ఎన్నికల సంఘం లేఖ రాసినట్లు సామాజిక మాధ్యమాలలో వార్తలు వస్తున్నాయి. వీటిలో నిజమెంత ఉందో తెలియదు. అయితే పంచాయతీ ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తారని అంటున్నారు. గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉండడంతో ఇబ్బంది పడకుండా ఈ నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు.

అనాలని అన్నారా ...కేటీఆర్ కామెంట్స్ వైరల్ !

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. దేశంలో మంచి విద్యా సంస్థలు లేకనే అనేక మంది విదేశాలకు వెళ్తున్నారు అని ఆయన పేర్కొన్నారు. ఎనభయ్యేళ్ళ స్వాతంత్ర్యం తరువాత కూడా దేశంలో ఉన్నత స్థాయిలో విద్యా సంస్థలు సరైనవి లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. అనివార్యమైన పరిస్థితులలో దేశీయంగా ఉండే విద్యార్థులు విదేశాలకు వెళ్లాల్సి వస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

కుమార్తె ప్రస్తావన తెస్తూ :

ఇదిలా ఉంటే తాజాగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంలో ఆయన తన కుమార్తె అమెరికాలో చదువుతున్న ఉదంతాన్ని ప్రస్తావిస్తూ ఈ రకంగా వ్యాఖ్యలు చేశారు. దేశంలో ప్రపంచ స్థాయి వసతులతో కూడిన కాలేజీలు లేకపోవడం వలనే ఉన్నత విద్య కోసం విద్యార్థులు అమెరికా తదితర దేశాలకు వెళ్తున్నారని ఆయన అన్నారు. తన కూతురు కూడా విదేశాలలో చదువుకుంటానని చెప్పడం వెనక అదే ఉద్దేశ్యం ఉందని అన్నారు.

దేశంలోనే అత్యుత్తమ సంస్థలను ఏర్పాటు చేసి కేవలం విద్య మాత్రమే కాకుండా మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తే

విదేశాలకు వెళ్లే యువత సంఖ్య గణనీయంగా తగ్గుతుందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఎంతసేపూ కులాలు మతాలు ఇతర అంశాల మీదనే చర్చ సాగుతోందని కానీ దేశానికి అవసరం అయిన విలువైన విద్య విషయంలో జరగాలని ఆయన కోరుకున్నారు. అంతే కాదు విద్యాభివృద్ధి మీద దృష్టి పెట్టాలని ప్రపంచ స్థాయి విద్యా సంస్థలు ఏర్పాటు కావాలని అన్నారు.

భిన్నాభిప్రాయాలు :

అయితే కేటీఆర్ తాజాగా చేసిన ఈ కామెంట్స్ మీద నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ఈ పరిస్థితికి కారణాలు ఏమిటి అన్నది కూడా ప్రశ్నిస్తున్నారు. పాలకులు రాజకీయ నేతలే కదా అని నిలదీస్తున్నారు. దేశంలో ప్రపంచ స్థాయి విద్యను అందించే ఐఐటీలు ఐఐఎంలు , ఐఐఎస్‌సీ వంటి ఎన్నో అంతర్జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. కేటీఆర్ చేసిన విమర్శలు కేవలం రాజకీయ లబ్ధి కోసం మాత్రమే అని నెటిజన్లు మరి కొందరు అంటున్నారు. భారతీయ విద్యా వ్యవస్థను తక్కువ చేసి మాట్లాడటం సరికాదని కొందరు నెటిజన్లు అంటూంటే కేటీఆర్ వ్యాఖ్యలను రాజకీయ ప్రత్యర్థులు సైతం విమర్శిస్తున్నారు. విద్యాపరంగా భారత్ ని చిన్నబుచ్చడం సరికాదని అంటున్నారు.

గ్లోబల్ ఎక్స్‌పోజర్ కోసమే :

కేటీఆర్ చెప్పే దాంట్లో ఆయన కోణంలో నిజం ఉందని అనుకున్నా అందరూ విదేశాలకు వెళ్ళి చదువుకోలేరు కదా అని అంటున్న వారూ ఉన్నారు. ఇక డబ్బున్న వారి బిడ్డలు రాజకీయ నేతల పిల్లలు సంపన్నుల వారసులు కేవలం గ్లోబల్ ఎక్స్‌పోజర్ కోసమే విదేశాలకు వెళ్ళి విద్యను అభ్యసిస్తున్నారు అన్న విమర్శలు చేస్తున్న వారు ఉన్నారు. దేశంలో నాణ్యమైన విద్యను అందించే ప్రతిష్టాత్మక సంస్థలు బలంగానే ఉన్నాయని విద్యా వేత్తలు గుర్తు చేస్తున్నారు. అయితే ప్రపంచ విద్యా సంస్థలు భారత్ లో లేకపోవడం కారణం కాదని గ్లోబల్ కెరీర్ ఆశలతో భారీ ప్యాకేజీలు ఆధునిక సాంకేతిక పరిశోధనల కోసం విద్యార్థులు విదేశాలను ఎంచుకుంటున్నారని విద్యా రంగం నిపుణులు అంటున్నారు.

విదేశీ వర్శిటీల క్యాంపసులు :

ఇవన్నీ పక్కన పెడితే దేశంలో నాణ్యమైన సంస్థలుగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఐఐటీలు, ఎన్ఐటీలు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ స్థాయిలోనే గుర్తింపు పొందాయని చెబుతున్నారు. గతంలో ఎలా ఉన్నా ఇటీవల కాలంలో దేశంలోనే విద్యా ప్రమాణాలు పెరుగుతున్నాయని విద్యా వేత్తలు అంటున్నారు. మరో ముఖ్య విషయం ఏమిటి అంటే అనేక విదేశీ విశ్వవిద్యాలయాలు కూడా భారతదేశంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నాయి. మరి దీనిని బట్టి చూస్తే భారతీయ విద్యను తక్కువ చేయగలమా అన్న ప్రశ్నలు వస్తున్నాయి.

స్థానికంలో బీసీ రిజర్వేషన్లు లేనట్లే..? చంద్రబాబు సంకేతాలు



హైదరాబాద్ పెన్ పవర్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఈ మేరకు సంకేతాలిచ్చారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే వెనుకబడిన తరగతులకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే రాజ్యాంగ నిబంధనల ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పెరగడానికి వీలు లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు సూచనల మేరకు నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ నివేదికతో బీసీ రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించారు. అయితే శనివారం నివేదిక సమర్పించిన కమిషన్ ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను మరో నాలుగు శాతం మేర పెంపునకు ఇబ్బంది లేదని సూచించింది. దీంతో ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచనలో పడిందని అంటున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు 23.84 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల మేరకు బీసీ జనాభాకు తగినట్లు మరో 3.82 శాతం మేర రిజర్వేషన్లు పెంచడానికి మాత్రమే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో మొత్తం బీసీ జనాభా 50.26 శాతం కాగా, ఆ లెక్కన 27.66 శాతం వరకు స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడానికి సమస్య ఉండదని అంటున్నారు. అయితే ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట ఇచ్చారు.ఎన్నికల హామీ అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సివుంటుంది. ఇందుకు కుల గణన జరగాలి. దేశంలో 1931 తర్వాత ఎక్కడా కుల గణన చేయలేదని అంటున్నారు. ప్రస్తుతం ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా, ఈ ప్రక్రియ ముగియడానికి మరో ఏడాది పడుతుందని భావిస్తున్నారు. అయితే వచ్చేనెల నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టాలని భావిస్తున్న ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై విస్తృతంగా సమాలోచనలు చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తోందని చెబుతున్నారు.
ఇక రాజ్యాంగం ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. తెలంగాణలో కూడా బీసీ రిజర్వేషన్లు పెంచాలని చూసినా సుప్రీం కోర్టు తీర్పు కారణంగా బ్రేక్ పడింది. దీంతో అక్కడ పార్టీ పరంగా రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు నిర్వహించారని చెబుతున్నారు. ఇక రాష్ట్రంలో సుప్రీంకోర్టు సూచనల మేరకు డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులతో రిజర్వేషన్లు పెంచుకోవాలని చూసినా, అందుబాటులో ఉన్న కులాల లెక్కలతో కేవలం 3.82 శాతం మేర రిజర్వేషన్లు పెంచేందుకే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానికంలో బీసీ రిజర్వేషన్లపై ఆలోచన మార్చుకున్నట్లు చెబుతున్నారు.ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 34 శాతం రిజర్వేషన్ అమలు చేయడం సాధ్యమయ్యేలా లేదని భావిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ మోడల్ ను అనుసరించాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వ పరంగా రిజర్వేషన్లు అమలు చేయకపోయినా కూటమిలోని మూడు పార్టీలు కలిపి 34 శాతం స్థానాలలో బీసీలను పోటీపెట్టాలని భావిస్తున్నారని అంటున్నారు. శనివారం కూటమి పక్షాల నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఇదే విషయాన్ని స్పష్టం చేశారని చెబుతున్నారు. దీంతో స్థానికంలో బీసీ రిజర్వేషన్ పెరిగే పరిస్థితి కనిపించడం లేదన్న విషయం స్పష్టం అవుతోందని అంటున్నారు.

జగన్ కు లేదా స్వాతంత్ర్యం!.. సోషల్ మీడియాలో హాట్ టాపిక్

హైదరాబాద్ పెన్ పవర్: మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి వైఖరిపై మీడియా సర్కిల్స్ లో విస్తృత చర్చ జరుగుతోందని చెబుతున్నారు. శనివారం దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుకుంటే, మాజీ సీఎం జగన్మోహనరెడ్డి మాత్రం కేవలం ఒక్క ట్వీట్ తో సరిపెట్టడంపై విమర్శలు గుప్పిస్తున్నారు. బాధ్యత గల ప్రతిపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జెండా వందనం చేయాల్సివుండగా, ఆయన ఎక్కడా స్వాతంత్ర్య సంబరాల్లో పాలు పంచుకోలేదని చెబుతున్నారు. విపక్షంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఆయన స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనలేదని, అంతకు ముందు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జెండా వందనం చేసేవారని అంటున్నారు.మాజీ సీఎం జగన్మోహనరెడ్డి జెండా వందనం చేయకపోవడంపై సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో గతంలో ఒకసారి ఆయన జెండా వందనం చేసిన సమయంలో జనగణమన గీతాన్ని సరిగా ఆలపించలేదని ఆరోపిస్తూ విస్తృతంగా ట్రోలింగ్ చేస్తున్నారు. ఈ విషయమై వైసీపీ సోషల్ మీడియా నుంచి కూడా ఎటువంటి స్పందన, కౌంటర్లు లేకపోవడమే హాట్ టాపిక్ అవుతోంది.ఇక జగన్ రెడ్డికి అధికారం తప్ప, దేశంపై బాధ్యత లేదంటూ టీడీపీ అనుకూల మీడియాలో విమర్శలు చేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర వేడుకల సందర్భంగా ప్రతి పౌరుడు జెండా వందనం చేయడం ఒక బాధ్యతగా భావించాలని వ్యాఖ్యానిస్తున్నారు. కానీ, ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేయడమే కాకుండా, 2011 నుంచి ఒక ప్రధానమైన పార్టీని నడుపుతున్న నాయకుడిగా జగన్ రెడ్డి ఎక్కడో ఒక చోట జెండా వందనం చేస్తే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.సహజంగా ఆగస్టు 15, జనవరి 26 వేడుకల్లో నాయకులు, అధికారులు విధిగా జెండా వందనం చేస్తుంటారు. అధికారంలో ఉంటే వారి బాధ్యతలకు తగ్గట్టు నిర్దేశిత స్థలాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అదే సమయంలో ప్రతిపక్ష పార్టీలు, ఇతర ప్రైవేటు సంస్థలు ఉన్న చోట ఆయా కార్యాలయాల వద్ద జెండా ఎగుర వేస్తుంటారు. అయితే శనివారం జరిగిన 80వ స్వాతంత్ర్య వేడుకల్లో మాజీ సీఎం జగన్ రెడ్డి ఎక్కడా ఈ కార్యక్రమం నిర్వహించలేదని చెబుతున్నారు. తాడేపల్లిలోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో మాజీ మంత్రి, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ జెండాను ఆవిష్కరించారు. జగన్ రెడ్డి అందుబాటులో లేకపోవడం వల్ల ఆయన ఈ కార్యక్రమానికి చేశారని చెబుతున్నారు. అయితే బెంగళూరులో ఉన్న జగన్ రెడ్డి అక్కడైనా జెండా ఆవిష్కరిస్తే బాగుండేది, అనవసర విమర్శలకు తావిచ్చే పరిస్థితి వచ్చేది కాదని వైసీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

‘వికసిత్ భారత్’ లక్ష్య సాధనకు ‘సప్తధార’: ఏడేళ్లలోనే దశాబ్దాల ప్రగతి సాధ్యమేనా?

హైదరాబాద్ పెన్ పవర్: భారతదేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో పూర్తి స్థాయి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే బృహత్తర లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మరొక అత్యంత కీలకమైన వ్యూహాత్మక అడుగు వేసింది. దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు సాంకేతిక, రక్షణ, వ్యవసాయ, మౌలిక వసతుల రంగాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ పోటీలో భారత్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ‘సప్తధార’ అనే నూతన ప్రణాళికను ప్రకటించారు. గత కొన్ని దశాబ్దాలుగా వేగంగా మారిన అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో రాబోయే ఐదేళ్ల నుంచి ఏడేళ్ల అతిస్వల్ప కాలంలోనే ఊహించని రీతిలో వేగవంతమైన ప్రగతిని సాధించడమే ఈ నూతన కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.
ఈ ‘సప్తధార’ వ్యూహంలో భాగంగా దేశ భవిష్యత్ ప్రగతికి అత్యంత కీలకమైన ఏడు రంగాలు ఒకదానితో ఒకటి అనుసంధానమై ముందుకు సాగనున్నాయి. ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయికి దేశీయ ఉత్పత్తిని పెంచడానికి తయారీ రంగాన్ని భారీగా విస్తరించడం, అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలకు భారత్‌ను ప్రధాన తయారీ కేంద్రంగా మార్చడం తొలి ప్రాధాన్యతగా మారనుంది. దీనితో పాటుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరిస్తూ ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి విస్తృత ఊతాన్ని అందించడం ద్వారా ఉత్పత్తులకు సరైన విలువను జోడించి రైతుల ఆదాయాన్ని పెంచడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం సాధ్యమవుతుంది.
సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మక మార్పులు వస్తున్న ప్రస్తుత యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్‌టెక్ వంటి అత్యాధునిక రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని పెంచుకోవడంపై ప్రభుత్వం ప్రత్యేక దృక్పథంతో ముందుకు వెళ్తోంది. పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు యువతలో నైపుణ్యాభివృద్ధి ద్వారా భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారత్ అగ్రగామిగా నిలిచే అవకాశం ఉంది. ఇక రక్షణ రంగంలో పూర్తి స్థాయిలో ‘ఆత్మనిర్భరత’ సాధించి, స్వదేశీ పరికరాల తయారీని పెంచడమే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులను పెంచే కార్యాచరణ సైతం ఇందులో భాగమై ఉంది. రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు , డిజిటల్ మౌలిక వసతుల వేగవంతమైన కనెక్టివిటీ దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తుందని అంచనా వేస్తున్నారు.



మరొకవైపు పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన ప్రగతి కోసం పునరుత్పాదక ఇంధనం, సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాల ద్వారా గ్రీన్, బ్లూ ఎకానమీకి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వీటితో పాటు భారతీయ సాంస్కృతిక ముద్ర అయిన యోగా, ఆయుర్వేదం , సంప్రదాయ జ్ఞానాన్ని అంతర్జాతీయ స్థాయిలో విస్తరింపజేయడం ద్వారా దేశ సాఫ్ట్ పవర్‌ను బలపరచడం కూడా ఈ ఏడు ధారల సమ్మేళనంలో భాగమై ఉంది.
అయితే కొన్ని దశాబ్దాలుగా సాధ్యం కాని అభివృద్ధిని రాబోయే ఏడేళ్లలోనే సాధించాలనే ఈ గొప్ప ఆలోచన కార్యరూపం దాల్చాలంటే విధానాల రూపకల్పనతో పాటు క్షేత్రస్థాయిలో సరైన అమలు అత్యంత కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నడుమ సమర్థవంతమైన సమన్వయం, ప్రైవేట్ రంగం నుంచి వస్తున్న భారీ పెట్టుబడులు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు, నిరంతర నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలు ఈ ప్రణాళిక విజయవంతం కావడానికి ప్రాథమిక పునాదులుగా నిలుస్తాయి. సమగ్ర ప్రణాళికతో ఈ ఏడు రంగాలపై ఏకకాలంలో దృష్టి సారించగలిగితే ‘వికసిత్ భారత్’ కల కేవలం ఒక స్వప్నంగా మిగిలిపోకుండా.. నిర్ణీత కాలపరిమితిలోనే సాకారమయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

పనిచేసిన చేతబడి ప్రచారం..!! భయంతో రూ.19 లక్షలు రిటన్ చేసిన దొంగ

హైదరాబాద్ పెన్ పవర్: మంత్రాలకు చింతకాయలు రాలుతాయో లేదో కానీ, మంత్రాలు వేయిస్తాం, దొంగను పట్టేస్తాం అన్న ప్రచారానికి ఒక దొంగ మాత్రం హడలిపోయాడు. రెండు వారాల క్రితం దొంగతనం చేసిన నిందితుడు, బాధితులు చేతబడి చేయిస్తే తన ఆచూకీ తెలిసిపోతుందనే భయంతో రూ.19 లక్షల నగదును తిరిగి ఇచ్చేశాడు. అంతేకాకుండా తన వాటా డబ్బు తిరిగి ఇచ్చేస్తున్నానని, తన పాటనర్ల సమాచారం మాత్రం అడగొద్దని, చేతబడి చేయొద్దు అంటూ వేడుకున్నాడు. ప్రస్తుతం ఈ ఘటన సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది.పల్నాడు జిల్లా కేంద్రం నరసారావుపేటలో గత నెల 30న జరిగిన చోరీ కేసు అనూహ్య మలుపు తిరిగింది. ఘటన జరిగి రెండు వారాలు అయినా నిందితుల ఆచూకీ లేకపోయినప్పటికీ, దొంగ మాత్రం స్వచ్ఛందంగా రూ.19 లక్షల నగదును బాధితులకు తిరిగి ఇచ్చేసి ఆశ్చర్యపరిచాడు. ఇలా దొంగ తాను చోరీ చేసిన డబ్బును వెనక్కి ఇవ్వడానికి ప్రధాన కారణం దొరికిపోతాననే భయమేనని అంటున్నారు. తన ఆచూకీ తెలుసుకోడానికి బాధితులు చేతబడి చేయిస్తున్నారని విస్తృతంగా జరిగిన ప్రచారంతో దొంగ భయపడ్డాడని, చోరీచేసిన డబ్బును గుట్టుచప్పుడు కాకుండా బాధితుల ఇంటి ముద్దు పెట్టాడని చెబుతున్నారు. అంతేకాకుండా డబ్బుతోపాటు ఒక లేఖను రాసిన దొంగ తనను ఇక్కడితో వదిలేయాలని వేడుకోవడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది.నరసారావుపేటలోని ప్రకాశ్ నగర్ బాలాజీ ఆర్కేడ్ అపార్టమెంటులో నివాసం ఉంటున్న ఆదినారాయణరెడ్డి, కోటేశ్వరమ్మ దంపతులు గత నెల 30న సమీమ బంధువు మరణించారని తెలిసి రొంపిచర్ల మండలంలోని కొత్తపల్లి గ్రామానికి వెళ్లారని చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న దొంగలు ఆ రోజు రాత్రి ఇంట్లో చొరబడి రూ.25 లక్షల నగదు, 317 గ్రాముల బంగారంతో ఉడాయించారు. ఆదినారాయణరెడ్డి దంపతులు మరునాడు ఇంటికి వచ్చి చూసిన తర్వాత దోపిడీ విషయం వెలుగుచూసింది. వెంటనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఘటనా స్థలిలో ఆధారాలు సేకరించారు. దొంగల వేలిముద్రలతోపాటు సీసీ ఫుటేజీ సేకరించాలని భావించారు. అయితే అపార్టమెంటులో సీసీటీవీ ఫుటేజీలో దొంగల ఆచూకీ లభ్యం కాకపోవడం, ఆదినారాయణరెడ్డి ఇంట్లో ఎవరూ లేరన్న పక్కా సమాచారంతోనే దొంగతనం జరిగినట్లు భావించిన పోలీసులు ఆ దిశగా విచారణ చేస్తున్నారని అంటున్నారు. అయితే ఘటన జరిగి సుమారు 15 రోజులు అవుతున్నా ఎటువంటి పురోగతి లేకపోవడంతో బాధితులు తమ సొత్తు ఎలా పోయిందో తెలుసుకోవాలని అంజనం వేయించాలని భావించారని అంటున్నారు.ఈ విషయంపై పట్టణంలో విస్తృతంగా ప్రచారం జరగడంతో శనివారం ఉదయం ఆదినారాయణరెడ్డి ఇంటి ముందు చెప్పుల స్టాండులో రూ.19 లక్షల నగదుతో ఒక బ్యాగు కనిపించిందని చెబుతున్నారు. ఆ బ్యాగులో డబ్బుతోపాటు ఒక లేఖ కూడా ఉంది. తాను చేసిన పొరపాటును తెలియజేసిన దొంగ తన వాటా రూ.19 లక్షలు తిరిగి ఇచ్చేస్తున్నానని, మిగతా డబ్బు విషయంపై మాత్రం తనను అడగొద్దని ప్రాధేయపడ్డాడు. అంతేకాకుండా చేతబడి చేయొద్దని వేడుకున్నాడు. దీంతో పోలీసులకు భయపడని దొంగ, చేతబడి ప్రచారంతో హడలిపోయాడని భావిస్తున్నారు. అయితే డబ్బుతో బ్యాగు దొరికిన విషయాన్ని బాధితులు పోలీసులకు తెలియజేయడంతో దొంగతనం తెలిసిన వారి పనే అయివుంటుందని అనుమానిస్తున్నారు. ఇక ఇటీవల ఇటువంటి ఘటన తునిలో కూడా జరిగిందని చెబుతున్నారు. దొంగతనం చేసిన దుండగులు గ్రామపెద్దలు వెలివేస్తారనే భయంతో చోరీ సొత్తును బాధితుల ఇంటి ముందు పారేసి వెళ్లిపోయారని చెబుతున్నారు.

విశాఖను ఎంచుకున్న నితిన్ నబీన్ !

హైదరాబాద్ పెన్ పవర్: బీజేపీకి జాతీయ అధ్యక్షుడు అయ్యాక నితిన్ నబీన్ ఏపీకి రావడం ఇదే తొలిసారి. అయితే ఆయన ఏపీ పర్యటనలో భాగంగా మొదటిగా అడుగుపెట్టే ప్రాంతంగా విశాఖపట్నాన్ని ఎంచుకున్నారు. ఆయన ఏపీకి ఇలా వచ్చి అలా వెళ్ళిపోవడం లేదు, అయిదు రోజుల పాటు ఏపీలోనే ఉండబోతున్నారు. విశాఖనే కేంద్రంగా చేసుకుని ఆయన ఏపీ బీజేపీ బలోపేతానికి దిశా నిర్దేశం చేస్తారని తెలుస్తోంది. ఇక చూస్తే ఇప్పటికే తెలంగాణాకు రెండు మూడు సార్లు వచ్చి వెళ్ళిన నితిన్ నబీన్ ఏపీకి మొదటిసారి రావడం విశేషం. రాజకీయ కార్యక్షేత్రంగా విశాఖను ఎంపిక చేసుకోవడం మరో విశేషం.

భోగాపురం నుంచే నేరుగా :
ఇక భోగాపురం ఎయిర్ పోర్టు తన ఆపరేషన్స్ ని స్టార్ట్ చేసే ఈ నెల 17నే నితిన్ నబీన్ అదే ఎయిర్ పోర్టులో ఢిల్లీ నుంచి విమానంలో ల్యాండ్ అవుతున్నారు. అక్కడ నుంచి నేరుగా ఆయన విశాఖ చేరుకుంటారు. ఇక నితిన్ నబీన్ అయిదు రోజుల బిజీ షెడ్యూల్ కూడా పార్టీ ఖరారు చేసింది. ఆయన విశాఖలో పార్టీ సమావేశాలను నిర్వహిస్తారని అంటున్నారు. అలాగే 17 నుంచి 21 వరకూ ఏపీలో ఉంటారని తెలుస్తోంది. ఆగస్టు 17 సాయంత్రం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోనున్న నితిన్ నబీన్ కి బీజేపీ నేతలు, కార్యకర్తల ఘన స్వాగతం పలుకుతారు. ఆగస్టు 18 ఉదయం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దర్శనం చేసుకుంటారు. అనంతరం విశాఖలో జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జీలు, రాష్ట్ర పదాధికారులతో సమావేశం నిర్వహిస్తారు అని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఏపీ మీద ఫోకస్ :
లోకల్ బాడీ ఎన్నికలు తొందరలో ఏపీలో నిర్వహించబోతున్నారు. బీజేపీకి అయిదు శాతం సీట్లు ఇస్తారని అంటున్నారు. అయితే తమ వాటా పెంచాలని బీజేపీ నేతలు కోరుతున్నారు. ఇదే సమయంలో ఏపీకి వస్తున్న నితిన్ నబీన్ దీని మీద పార్టీ రాష్ట్ర శాఖకు కూడా సూచనలు చేయవచ్చు అని అంటున్నారు. ఇక ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉండడంతో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అవుతారా అన్న చర్చ కూడా సాగుతోంది. ఇక ఏపీలో ఆయన ఎక్కడెక్కడ పర్యటిస్తారు అన్నది కూడా పార్టీ వర్గాల నుంచి సమాచారం రావాల్సి ఉంది. ఏపీలో బీజేపీ ఎదుగుదల మీద నితిన్ నబీన్ ఫోకస్ పెట్టారని అంటున్నారు.

పార్టీకి బిగ్ టాస్క్ :
తెలంగాణాలో అధికారం దిశగా ఆశలు పెంచుకుంటున్న బీజేపీ ఏపీలో నిర్ణయాత్మకమైన శక్తిగా అవతరించాలని భావిస్తోంది. అయితే ఏపీలో బీజేపీ అంత యాక్టివ్ గా లేదని వార్తలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో యువకుడు అయిన బీజేపీ కొత్త అధ్యక్షుడు పార్టీ పటిష్టత గురించి క్యాడర్ కి లీడర్ కి చెప్పాల్సింది చెబుతారు అని అంటున్నారు. 2029 ఎన్నికల నాటికి ఏపీలో బీజేపీని పూర్తిగా బలోపేతం చేయడమే నితిన్ నబీన్ అజెండాగా ఉంది. తెలంగాణాలో ఇప్పటికే పార్టీ నేతలకు టాస్క్ ఇచ్చిన ఆయన ఏపీలో బీజేపీకి కూడా లక్ష్యాన్ని నిర్దేశించి వెళ్తారని అంటున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

పది లక్షల కోట్ల రుణాలు... ఒక్క దెబ్బతో రద్దు !

పేదవాడు సామాన్యుడు బ్యాంకులకు వెళ్తే వారికి అక్కడ సవా లక్ష నిబంధలు ఎలా ఇబ్బంది పెడతాయో అందరికీ తెలిసిందే. సంతకం చివర చిన్న గీత ఉన్నా మీది కానే కాదంటారు. ఇక అప్పులు తీసుకుంటే సకాలంలో చెల్లించకపోతే బ్యాంకులు అసలు ఊరుకోవు. ముక్కు పిండి మరీ వసూలు చేస్తాయి. కానీ అదే బడా బాబులు కార్పోరేట్ పెద్దలు అంటే మాత్రం రుణాలు ఇవ్వడమే తప్ప వసూళ్ళు ఉండవని విమర్శలు ఉన్నాయి. అంతే కాదు వారి రుణాలను మొండి బాకీలుగా రాని బాకీలుగా చూపించి ఏదో రోజున రైట్ ఆఫ్ అంటూ రద్దు చేయడమూ జరుగుతున్న సంగతి తెలిసిందే.

పన్నెండేళ్ళలో జరిగిందిదే :

ఇక కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడచిన పన్నెండేళ్లలో బడా బాబులు తీసుకున్న రుణాలు అక్షరాలా 9, 95 లక్షల కోట్లు అంటే సుమారుగా పది లక్షల కోట్ల రూపాయల రుణాలను రైట్ ఆఫ్ పేరుతో రద్దు చేసి పారేసారు. ఈ వివరాలను అధికారికంగా తెలియచేసింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి. ఆయన పార్లమెంట్ లో ప్రశ్నకు లిఖిత పూర్వకమైన జవాబు చెబుతూ ఈ వివరాలు వెల్లడించారు ఇందులో చూస్తే అత్యధికంగా 2018–19 ఆర్థిక సంవత్సరంలో 1.48,753 కోట్ల రూపాయల రుణాలను రద్దు చేస్తే 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా పెద్ద పరిశ్రమలు సేవలకు సంబంధించిన బకాయి పడ్డ రుణాలు మొత్తాలు 63,19,057 కోట్లుగా ఉంటే 2026 ఆర్థిక సంవత్సరంలో ఈ మొండి బకాయిలు 69,21,734 కోట్ల రూపాయలకు పెరిగాయని కేంద్ర మంత్రి అధికారికంగా చెప్పారు. అంటే ఈ రోజున దేశంలో బడా బాబుల రుణాలు దాదాపుగా డెబ్బై లక్షల కోట్ల దాకా ఉన్నాయని అంటున్నారు.

వెసులుబాటు మాత్రమేనట :

అయితే దీని మీద విపక్షాల అభ్యంతరాలకు కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి వివరణ ఇస్తూ ఇది కేవలం బ్యాంకులు తమ ఖాతా పద్దు పుస్తకాలను సరి చేసుకునే ఒక అకౌంటింగ్ ప్రక్రియ మాత్రమే అని అంటున్నారు. దీని వల్ల కార్పోరేట్ సంస్థల రుణాల మాఫీ కానీ రద్దు కానీ జరగదని అంటున్నారు. ఇది కేవలం సాంకేతిక ప్రక్రియ మాత్రమే అని రుణ గ్రహీతలకు ఉప శమనం కలిగించేందుకు రుణాలను పునర్ వ్యవస్థీకరించే విధానం అన్నారు. ఈ మేరకు బ్యాంకులకు విచక్షణాధికారాన్ని ఇస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిజల్యూషన్ ఆఫ్ స్ట్రెస్డ్ అసెట్స్ డైరెషన్స్ 2025 జారీ చేసినట్లుగా కేంద్ర మంత్రి చెబుతున్నారు.

అది రైట్ ఆఫ్ నే :

అయితే సాంకేతికంగా బాలెన్స్ సర్దుబాటు చేసుకున్నాక ఇక కార్పోరేట్లు బడా బాబులు రుణ ఉపశమనం పొందాక ఏ మేరకు తిరిగి తమ రుణాలకు చెల్లిస్తాయో అందరికీ తెలిసిందే అని అంటున్నారు. సామాన్యుడు రుణం తీసుకుంటే వెంట పడి వసూలు చేసే విధానం బడా బాబుల విషయంలోనూ రావాలని అంటున్నారు. లేకపోతే అది తప్పుడు సంకేతాలు వెళ్ళేలా చేస్తుందని అంటున్నారు. ఒక్కసారి ఖాతా పద్దులలో సర్దుబాటు జరిగిన మీదట రుణాలను బడా బాబుల నుంచి వసూలు చేయడం ఎవరి తరం అని అంటున్నారు. ఈ విధంగా పెద్దలకు గద్దలకు అనుగుణమైన తీరుని అనుసరిస్తూ దీనిని ఆర్థిక క్రమశిక్షణగా చూపించే ప్రయత్నం పట్ల విపక్షాలు అయితే మండిపడుతున్నాయి. పేదలు రైతులకు రుణాల మాఫీ ఎందుకు జరగదని కూడా ప్రశ్నిస్తున్నారు.

సంచలనం : మోడీ లోపాలను ఎత్తిచూపిన రాందేవ్ బాబా

దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్న వేళ ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు పూర్తయినప్పటికీ దేశంలో విద్య, ప్రభుత్వ నియామకాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి కీలక రంగాల్లో అనేక సమస్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి సాధనలో ఉన్న లోపాలను సరిదిద్దాల్సిన తక్షణ అవసరాన్ని ఆయన గుర్తుచేశారు.

పాఠశాలల్లో కనీస వసతుల కొరత

దేశంలోని పలు స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడంపై రాందేవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సరైన తరగతి గదులు, ఉపాధ్యాయులు, పాఠ్యపుస్తకాలు, విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్ల కొరత వల్ల విద్యార్థులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తమ ప్రాథమిక హక్కులు, సౌకర్యాల కోసం విద్యార్థులు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి ఏర్పడటం నిజంగా విచారకరమని వ్యాఖ్యానించారు.

యువతను దెబ్బతీస్తున్న పేపర్ లీకులు, అవినీతి

ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియలో తరచూ జరుగుతున్న పేపర్ లీకుల వ్యవహారం యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోందని ఆయన అన్నారు. అభ్యర్థులు ఎంతో కష్టపడి పరీక్షలకు సిద్ధమైతే చివరి నిమిషంలో ప్రశ్నపత్రాలు లీక్ కావడం వల్ల వారి శ్రమ వృథా అవుతోందన్నారు. ఇది నిరుద్యోగ యువతలో ప్రభుత్వ వ్యవస్థలపై ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగాల ఇంటర్వ్యూల్లో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని ఆరోపిస్తూ దాదాపు 90 శాతం వరకు అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని రాందేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన నిర్దిష్టమైన ఆధారాలను ఆయన బహిర్గతం చేయలేదు.

ముందే స్పందించకపోతే ప్రజాగ్రహం తప్పదు

ప్రజా సమస్యలు తీవ్ర రూపం దాల్చి ప్రజాగ్రహం కట్టలు తెంచుకునే వరకు వేచి చూడకుండా ప్రభుత్వాలు, వ్యవస్థలు వెంటనే స్పందించాలని ఆయన హెచ్చరించారు. ప్రజలలో అసంతృప్తి తీవ్రస్థాయికి చేరిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే లోపాలను గుర్తించి సరిదిద్దడమే సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంలో దేశం అనేక రంగాల్లో పురోగతి సాధించినప్పటికీ సమాజంలోని చివరి వరుసలో ఉన్న విద్యార్థికి, యువతకు నాణ్యమైన విద్య, పారదర్శకమైన ఉద్యోగ అవకాశాలు అందించాల్సిన బాధ్యత పాలక వ్యవస్థలపై ఉందనే తీవ్రమైన చర్చకు బాబా రాందేవ్ వ్యాఖ్యలు తెరలేపాయి. స్వాతంత్ర్య వేడుకలు కేవలం గతాన్ని స్మరించుకోవడానికే పరిమితం కాకుండా భవిష్యత్ సవాళ్లను అధిగమించే దిశగా అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఒకే నంబర్‌తో రెండు విమానాలు గాల్లో ఢీకొట్టే సమయంలో మిరాకిల్.. ప్రయాణీకులు సేఫ్!

అమెరికాలో శుక్రవారం అర్ధరాత్రి ఒకే ఫ్లైట్ నంబర్‌తో ప్రయాణిస్తున్న రెండు విమానాలు ఎదురెదురుగా వచ్చే ప్రమాదం తృటిలో తప్పిపోయి, భారీ విమాన ప్రమాదాన్ని ఆపగలిగారు. ఆకాశంలో ఒకే నంబర్‌తో ప్రయాణిస్తున్న రెండు అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానాలను ఫీనిక్స్ విమానాశ్రయానికి చెందిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (గాజు) సమయస్ఫూర్తితో గమనించి.. తగిన సూచనలు ఇవ్వడం ద్వారా ప్రమాదాన్ని ఆపారు. అసోసియేటెడ్ ప్రెస్ (ఏ.పి) నివేదిక ప్రకారం.. అధికారులు వేగం తెలివితేటల కారణంగా ఆ రెండు విమానాల్లోని ప్రయాణీకులందరూ సురక్షితంగా బయటపడ్డారు. సాధారణంగా అమెరికన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ నంబర్ 2482 షికాగో– ఫీనిక్స్ నగరాల మధ్య రాకపోకలు సాగిస్తుంటుంది. అయితే వాతావరణం అనుకూలించకపోవడం వల్ల షికాగో నుంచి రావాల్సిన విమానం ఆలస్యమైంది. దీనితో ఎయిర్‌లైన్స్ యాజమాన్యం ఫీనిక్స్ నుంచి సమయానికి బయలుదేరడానికి మరొక విమానాన్ని కేటాయించింది. సరిగ్గా అదే సమయంలో షికాగో విమానం ఫీనిక్స్ చేరుకోవడం.. ఫీనిక్స్ విమానం టేకాఫ్ అవ్వడం ఒకేసారి జరగడంతో ఒకే విమాన నంబర్‌తో రెండు విమానాలు ఒకే ఆకాశ మార్గంలోకి వచ్చాయి. ఏటిసి మానిటర్‌పై ఈ విషయాన్ని గమనించిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ వెంటనే అప్రమత్తమయ్యారు. గందరగోళాన్ని నివారించేందుకు ఆయన రాకపోకలు సాగిస్తున్న విమానాలను –అమెరికన్ 2482 అరైవల్–, –అమెరికన్ 2482 డిపార్చర్– అని పిలుస్తూ పైలట్లకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. కింద నుంచి టేకాఫ్ అవుతున్న విమానం పైకి లేవకుండా నియంత్రిస్తూ... పైన వస్తున్న విమానాన్ని సురక్షితమైన ఎత్తులోనే ఉంచి.. పైలట్లు పరస్పరం ఒకరినొకరు చూసుకునేలా చేస్తూ ప్రమాద పరిధి నుండి తప్పించారు.

ఈ ఘటనపై 25 ఏళ్ల అనుభవం ఉన్న ఆ కంట్రోలర్ స్పందిస్తూ.. తన కెరీర్‌లో ఒకే కాల్ సైన్‌తో రెండు విమానాలు ఇలా ఒకే చోటికి రావడం ఎప్పుడూ చూడలేదని... ఇది చాలా అరుదైన విషయమని తెలిపారు. పైలట్ కూడా కంట్రోలర్ సమయస్ఫూర్తిని కొనియాడగా... ఇది పెద్ద ప్రమాదానికి దారితీసేదే... కానీ సమయానికి పరిస్థితి చక్కబడటం ఊరటనిచ్చింది! అని ఆయన పేర్కొన్నారు. విమాన సంస్థ డిస్పాచ్ సెంటర్ చేసిన పొరపాటు వల్లనే ఒకే నంబర్‌తో రెండు విమానాలు గాలిలోకి వచ్చాయని విమానయాన భద్రతా నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఈ అసాధారణ ఘటనపై అమెరికన్ ఎయిర్‌లైన్స్ – ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్.ఏ.ఏ) సమగ్ర విచారణకు ఆదేశించాయి. కంట్రోలర్ – పైలట్ల వృత్తి నైపుణ్యం.. అప్రమత్తత వల్ల ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని అమెరికన్ ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటనలో కొనియాడింది. వ్యవస్థలో లోపాలు ఉన్నా ప్రాణనష్టం జరగకుండా కాపాడే సురక్షితమైన మార్గాలు అందుబాటులో ఉన్నాయని ఈ ఘటన మరోకసారి నిరూపించింది.

ఒక్క కాల్‌తో 900 మందిని తీసేసిన 'జూమ్ రాజా'కే బోర్డు షాక్.. తన ఉద్యోగం కోసం ఇప్పుడు పోరాటం

"కర్మ అనేది ఒక సర్కిల్.. అది ఎప్పటికైనా తిరిగొస్తుంది" అనే నానుడి కార్పొరేట్ దిగ్గజాలకు కూడా వర్తిస్తుందని 'బెటర్ హోమ్ ఓ ఫైనాన్స్' మాజీ సీఈఓ విశాల్ గార్గ్ మరోసారి నిరూపించారు. 2021లో క్రిస్మస్ పండుగ ముంగిట.. ఒక్కటంటే ఒక్క జూమ్ కాల్ పెట్టి ఏకంగా 900 మంది ఉద్యోగులకు ఒకే దెబ్బతో షాకిచ్చిన గార్గ్ గారికే.. ఇప్పుడు కంపెనీ బోర్డు మైండ్ బ్లాంక్ అయ్యేలా లే ఆఫ్ పింక్ స్లిప్ చేతికిచ్చింది. "అయ్యో.. నా ఉద్యోగం నాకివ్వండి" అంటూ ఆయన ఇప్పుడు లీగల్ నోటీసులతో పోరాటం మొదలుపెట్టడం కార్పొరేట్ ప్రపంచంలో సరికొత్త హాస్యానికి తెరలేపింది.

వారం ముచ్చట.. వేటు పడింది..

ఆగస్టు 3న బెటర్ హోమ్ ఓ ఫైనాన్స్ బోర్డు ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. గార్గ్‌ను సీఈఓ పదవి నుండి తప్పించి.. మాజీ హెడ్జ్ ఫండ్ మేనేజర్ డేనియల్ లూయిస్‌కు సీఈఓ బాధ్యతలు అప్పగించింది. అసలు విచిత్రం ఏంటంటే.. లూయిస్ కంపెనీ బోర్డులోకి అడుగుపెట్టిన ఒక్క వారంలోనే విశాల్ గార్గ్‌ను బయటకు సాగనంపడం.. ఇతరుల ఉద్యోగాలు క్షణాల్లో ఊడదీసిన గార్గ్‌కు.. తన కుర్చీ ఇంత వేగంగా ఖాళీ అవుతుందని ఊహించి ఉండరు.

'నా కుర్చీ నాదే.. లూయిస్ మోసం చేశాడు..

తనను పదవి నుంచి తీసివేయడాన్ని విశాల్ గార్గ్ అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారు. కొత్తగా వచ్చిన డేనియల్ లూయిస్ బోర్డు సభ్యులను తప్పుదోవ పట్టించి.. కుట్ర చేసి తనను బయటకు నెట్టేశారని ఆయన ఆరోపిస్తున్నారు. "దాదాపు పదేళ్లు రక్తం ఒడ్డి కంపెనీని నిర్మిస్తే.. నన్నే సీఈఓ పదవి నుంచి తీసేస్తారా? ఇది మహా అన్యాయం" అంటూ ఘొల్లుమంటున్నారు. తన సీఈఓ పదవిని తిరిగి ఇచ్చేయాలంటూ ఇప్పటికే ఒక భారీ న్యాయవాదిని పెట్టుకుని.. బోర్డుకు అధికారిక లీగల్ నోటీసులు కూడా పంపించారు.

అప్పట్లో జూమ్ రచ్చ.. ఇప్పుడు న్యాయపోరాటం..

2021లో 900 మంది ఉద్యోగులను తొలగిస్తూ "మీ అదృష్టం బాగాలేదు.. మీ ఉద్యోగాలు పోయాయి" అని ఫేస్–టు–ఫేస్ చెప్పకుండా జూమ్ కాల్‌లో ముగించినప్పుడు ఈయన చూపించిన 'ప్రొఫెషనలిజం' నెటిజన్లను ముక్కున వేలేసుకునేలా చేసింది. నాటి విశాల్ గార్గ్ ప్రవర్తనపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. కానీ కాలం ఎంత విచిత్రమైనదో చూడండి.. పదిమందికి జీవనాధారమైన ఉద్యోగాలు తీసేటప్పుడు 'కంపెనీ పురోగతి' అని కారణాలు చెప్పిన గార్గ్.. ఇప్పుడు తన సొంత కుర్చీపోయేసరికి "ఇది కంపెనీకి జరిగే పెద్ద నష్టం" అని లీగల్ పోరాటానికి దిగడం విశేషం. బోర్డు తన నిర్ణయాన్ని మార్చుకుంటుందా లేక లూయిస్ సారథ్యంలోనే కంపెనీ ముందుకెళ్తుందా అన్నది పక్కనబెడితే.. "క్రింద పడ్డా నాదే పైచేయి" అన్నట్లుగా గార్గ్ చేస్తున్న ఈ లీగల్ డ్రామా ప్రస్తుతం నెట్టింట హల్‌చల్ చేస్తోంది..

మోడీ నోట యువత మాట ఎన్ని సార్లు వచ్చిందంటే ?

ప్రధాని నరేంద్ర మోడీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్ర కోట నుంచి ప్రసంగం చేశారు. ఆదే వేదిక నుంచి ఈసారి ఆయన జాతీయ జెండా ఆవిష్కరించడం ఇది 13వ సారి. ఈ విషయంలో మోడీ రికార్డు సాధించారు. ఇక ఎర్ర కోట ప్రసంగానికి మోడీ ప్రతీ ఏటా వేష ధారణ కూడా ప్రత్యేకంగా ఉంటుంది. అలాగే ఆయన ధరించే తలపాగా కూడా ఆకర్షణీయంగా ఉంటుంది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే మోడీ స్పీచ్ కూడా జనాలు ఎపుడూ ఆసక్తిని చూపిస్తూ వింటారు. అయితే మోడీ స్పీచ్ లో దేశానికి సంబంధించిన అనేక అంశాల ప్రస్తావన ఉంది. అలాగే ఎన్డీయే ప్రభుత్వ హయాంలో సాధించిన అభివృద్ధిని ఆయన మరోసారి ఇంతటి మహత్తర వేదికను ఆసరాగా చేసుకుని జాతికి వినిపించారు. ఇవన్నీ బాగానే ఉన్నాయి కానీ మోడీ స్పీచ్ లో ఈసారి అసలైన స్పెషాలిటీ ఉందని అంటున్నారు. అదేంటి అంటే విశేషమైనదే అని చెబుతున్నారు.

యువ జపంతోనే :

మోడీ నోట యువత మాట జపంగా మారింది అని అంటున్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించింది కేంద్ర ప్రభుత్వం మీద తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చిన సంగతి విధితమే. ఈ నేపధ్యంలో కేంద్ర కేబినెట్ లో ఒక మంత్రి కూడా రాజీనామా చేయాల్సి వచ్చింది. దాంతో యూత్ దెబ్బ ఎంతో పెద్దలకు బాగా తెలిసి వచ్చిందని అంటున్నారు. ఈ క్రమంలో మోడీ అయితే తరచూ ఇన్స్టా గ్రాం లో వీడియో పోస్టులు పెడుతూ వచ్చారు. అంతే కాదు ఆయన స్వయంగా తన కేబినెట్ సహచరులకు కూడా ఇన్స్టా లో ఎక్కువగా టచ్ లో ఉండమన్నారు. వీడియో పోస్టులతో యూత్ ని కనెక్ట్ కావాలని దిశా నిర్దేశం చేశారు. మరి మోడీ కూడా అదే పనిలో ఉన్నారని అంటున్నారు.

లెక్క చూసి మరీ :

మోడీ తన ప్రసంగంలో కనీసంగా ఒక పాతిక ముప్పై సార్లు యువత గురించి ప్రస్తావించారని చెబుతున్నారు. ఇన్ని సార్లు ఒక కీలక ప్రసంగంలో ఒక వర్గం గురించి ప్రధాని స్థాయి వ్యక్తులు గతంలో ప్రస్తావించిన సందర్భాలు అయితే తక్కువ అని అంటున్నారు. భారతీయ సమాజంలో మహిళకు రైతులు ఇలా వీరి గురించి ఎక్కువగా ప్రస్తావిస్తూ ఉంటారు. అయితే అది కూడా ఒకటికి రెండు మూడు సార్లు తప్పించి ఉండదు. కానీ ఇపుడు యువత గురించి మాత్రం అత్యధికంగానే పాలకులు మాట్లాడుతున్నారు. మోడీ అయితే యువతకు తమ ప్రభుత్వం ఏమి చేస్తుందో ఎర్ర కోట వేదికగా ఆగస్టు 15 వేడుకలను ఉద్దేశించి చెప్పారు. దీంతో యూత్ కి ప్రధాని స్థాయిలో ఎంతటి ప్రాధాన్యత ఇస్తున్నారో అన్నది అంతా ఆలోచిస్తున్నారు.

వారే కీలకం అంటూ :

ఇక 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువశక్తి పాత్రే కీలకమని స్పష్టం చేశారు. అందుకే కాగా కేంద్ర ప్రభుత్వం తరఫున పలు నూతన పథకాలను అలాగే సంచలన ప్రకటనలు మోడీ చేయడం విశేషం. యువతకు ప్రకటించిన ప్రధాన హామీలు చూస్తే ఇలా ఉన్నాయి. యువతకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అని ఆయన పేర్కొన్నారు. అంటే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద మధ్యతరగతి అభ్యర్థుల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సౌకర్యం కల్పించనున్నట్లుగా ప్రధాని చెప్పారు అన్న మాట.

కోటి మంది యువతకు :

అలాగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో యువతకు పెద్ద ఎత్తున శిక్షణ ఇస్తామని కూడా ప్రధాని ప్రకటించారు. వచ్చే ఏడాదిలో కోటి మంది యువతకు ఏఐ రంగంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లుగా మోడీ వెల్లడించారు. ఇక క్రీడా ప్రతిభ అన్వేషణలో యువతకు పట్టం కడతామని అన్నారు. 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా దేశవ్యాప్తంగా క్రీడా ప్రతిభను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లుగా మోడీ కీలక ప్రకటన చేశారు. స్టార్టప్‌లు ఇన్నోవేషన్ వంటి వాటిలో యువ ఫోకస్ అధికంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. యువత ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ కల్పనదారులుగా మారాలని యువత మారాలని మోడీ పిలుపు ఇచ్చారు. ఈ దిశగా నూతన ఆవిష్కరణల కోసం ఒక లక్ష కోట్ల నిధిని అందుబాటులోకి తెచ్చినట్లుగా ప్రధాని ఎర్ర కోట వేదికగా యువతకు గుర్తుచేశారు.

జనగణన 2027: దేశవ్యాప్తంగా 40 ప్రశ్నలు.. మీ నుంచి ఏ వివరాలు సేకరిస్తారంటే?

భారత్‌లో జనగణన 2027కు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈసారి జనగణనలో ప్రజల జనాభా వివరాలతో పాటు విద్య, ఉపాధి, వలసలు, బ్యాంకు ఖాతాలు, డిజిటల్ అక్షరాస్యత వంటి అంశాలపై కూడా సమాచారం సేకరించనున్నారు. మొత్తం 40 ప్రశ్నల ద్వారా ప్రతి వ్యక్తికి సంబంధించిన వివిధ వివరాలను నమోదు చేయనున్నారు. వ్యక్తి పేరు, కుటుంబంలో సంబంధం, లింగం, పుట్టిన తేదీ, వయసు, వైవాహిక స్థితి వంటి ప్రాథమిక వివరాలతో ప్రక్రియ ప్రారంభమవుతుంది. వివాహితుల విషయంలో వివాహ వయసు, జీవిత భాగస్వామి పేరు వంటి వివరాలను కూడా నమోదు చేస్తారు. అలాగే వ్యక్తి ప్రకటించిన జాతీయత, మతం, ఎస్సీ/ఎస్టీ/కుల వివరాలు, తల్లిదండ్రుల వివరాలను కూడా సేకరిస్తారు.

విద్య, ఉద్యోగంపై ప్రత్యేక వివరాలు

జనగణనలో విద్యకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వ్యక్తి అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, విద్యాసంస్థకు హాజరవుతున్నారా లేదా ఇప్పటివరకు సాధించిన అత్యున్నత విద్యార్హత, చదివిన కోర్సు లేదా విభాగం వంటి వివరాలు అడుగుతారు. ఉపాధి విషయంలో గత ఏడాదిలో ఎప్పుడైనా పని చేశారా, ఆర్థిక కార్యకలాపాల వర్గం, వృత్తి, పరిశ్రమ/వ్యాపారం/సేవ రంగం, కార్మికుల వర్గం వంటి అంశాలను నమోదు చేస్తారు. పని చేయని లేదా పరిమితంగా పనిచేసే వ్యక్తుల విషయంలో వారు చేస్తున్న ఆర్థికేతర కార్యకలాపాలు, ఉద్యోగం కోసం చూస్తున్నారా లేదా అందుబాటులో ఉన్నారా అనే వివరాలను కూడా తెలుసుకుంటారు.

వలసలు, నివాస వివరాలు

వ్యక్తి పుట్టిన ప్రదేశం, చివరిగా నివసించిన ప్రాంతం, వలస రావడానికి కారణం, ప్రస్తుత గ్రామం లేదా పట్టణంలో ఎంతకాలంగా ఉంటున్నారు, శాశ్వత నివాస చిరునామా వంటి వివరాలను కూడా సేకరిస్తారు. పని చేసే ప్రదేశానికి ఎలా ప్రయాణిస్తున్నారనే అంశం కూడా ప్రశ్నల్లో ఉంటుంది.

కుటుంబం, ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు

ప్రస్తుతం వివాహితులు, వితంతువులు, విడాకులు పొందిన వారు లేదా విడిపోయిన మహిళల విషయంలో ప్రస్తుతం జీవించి ఉన్న పిల్లల సంఖ్య, ఇప్పటివరకు జన్మించిన పిల్లల సంఖ్య వంటి వివరాలను నమోదు చేస్తారు. ప్రస్తుతం వివాహిత మహిళలకు గత ఏడాది జన్మించిన పిల్లల సంఖ్యను కూడా అడుగుతారు. దివ్యాంగులకు సంబంధించిన వివరాలతో పాటు కొవిడ్-19 వ్యాక్సినేషన్ ఎక్కడ పొందారనే సమాచారాన్ని కూడా సేకరించనున్నారు.

బ్యాంకు ఖాతాల నుంచి గుర్తింపు పత్రాల వరకు..

ఈసారి జనగణనలో ఆర్థిక, డిజిటల్ వివరాలకు కూడా చోటు కల్పించారు. వ్యక్తికి ఉన్న మొత్తం బ్యాంకు ఖాతాల సంఖ్య, అందుబాటులో ఉంటే మొబైల్ నంబర్‌ను నమోదు చేయనున్నారు. అలాగే ఆధార్ నంబర్, ఓటర్ ఐడీ, భారతీయ పాస్‌పోర్ట్ నంబర్, డ్రైవింగ్ లైసెన్స్ అందుబాటులో ఉన్నాయా? అనే వివరాలను కూడా సేకరించే ప్రశ్నలు ఉన్నాయి. ఇవన్నీ అందుబాటులో ఉంటేనే నమోదు చేసే విధంగా ప్రశ్నలను రూపొందించారు.

మొత్తంగా జనగణన 2027లో కేవలం జనాభా లెక్కలు మాత్రమే కాకుండా.. దేశ ప్రజల సామాజిక, విద్యా, ఆర్థిక, ఉపాధి, వలస, డిజిటల్ , గుర్తింపు సంబంధిత వివరాలపై విస్తృత సమాచారాన్ని సేకరించేందుకు 40 ప్రశ్నలను ఉపయోగించనున్నారు.

గల్ఫ్ సస్పెన్స్ థ్రిల్లర్: ఇరాన్ 'లెక్కలు'.. ఖతార్ 'ట్రిక్కులు'.. ఇంతకీ ఆ ఇద్దరు పైలట్లు ఏమైనట్టు?

గల్ఫ్ రీజియన్‌లో శాంతి పవనాలు వీస్తున్నాయని అమాయకంగా అనుకునేలోపే.. ఊహించని ట్విస్టులతో మైండ్ బ్లాంక్ అయ్యే పొలిటికల్ థ్రిల్లర్ మూవీ కథాంశం తెరపైకి వచ్చింది. ఇరాన్-ఖతార్ ల నడుమ ఇప్పుడు నడుస్తున్నది మామూలు వివాదం కాదు.. యుద్ధ విమానాలు, మిస్సింగ్ పైలట్లు, రెడ్‌క్రాస్ సంస్థ.. పైగా అంతర్జాతీయ రాజకీయం..కథలోకి వెళ్తే.. ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ 'ఐఆర్ఎన్ఏ' పక్కా ప్లాన్‌తో ఒక కథనాన్ని వదిలింది. మార్చిలో ఖతార్ సైనిక స్థావరంపై దాడికి వెళ్లిన మూడు ఇరాన్ యుద్ధ విమానాలు కాస్తా దెబ్బతిన్నాయని, వాటిలోని ముగ్గురు పైలట్లు సురక్షితంగా పారాచూట్ల సాయంతో బయటకు దూకి ఖతార్ బలగాలకు 'గెస్ట్‌లు'గా చిక్కారని ఇరాన్ మిలిటరీ చాలా కాన్ఫిడెంట్‌గా చెప్పేసింది. తమ పైలట్లను సురక్షితంగా రప్పించుకోవడానికి అంతర్జాతీయ రెడ్‌క్రాస్ తలుపులు కూడా తట్టేసింది. తీరా సీన్ ఖతార్‌కి షిఫ్ట్ అయితే ఊహించని క్లైమాక్స్ మొదలైంది.. 'ముగ్గురా? అబ్బే.. మా దగ్గర అంతమంది లేరండోయ్' అంటూ ఖతార్ విదేశాంగ శాఖ సూటిగా బాంబు పేల్చింది. తమ గగనతలంలోకి వచ్చిన విమానాలను కాంటాక్ట్ చేయడానికి ప్రయత్నిస్తే పైలట్ల నుంచి రెస్పాన్స్ లేదని.. చివరికి తాము గాలించగా కేవలం ఒకే ఒక్క పైలట్ మృతదేహం మాత్రమే దొరికిందని స్పష్టం చేసింది. 'పాపం ఆ మృతదేహాన్ని తీసుకెళ్లమని ఎంత పిలిచినా ఇరాన్ వైపు నుంచి స్పందనే లేదు' అని ఇంకో మెలిక పెట్టింది. ఇక్కడే అసలు కామెడీ.. సస్పెన్స్ మొదలయ్యాయి.. ఇరాన్ లెక్కల ప్రకారం ముగ్గురు పైలట్లు ఖతార్ రిసార్ట్‌లలో చిల్ అవుతున్నారు. ఖతార్ లెక్క ప్రకారం దొరికింది ఒక్కరే.. అదీ ప్రాణాలతో లేరు. మరి మిగిలిన ఇద్దరు పైలట్లు ఎక్కడికి మాయమైనట్టు? పారాచూట్ దారి తప్పి వేరే దేశంలో ల్యాండ్ అయ్యారా? లేక ఈ అంతర్జాతీయ పజిల్ వెనుక ఇంకేదైనా మిస్సింగ్ పీస్ ఉందా అనేది అసలైన మిలియన్ డాలర్ల ప్రశ్న.

అప్పటికే అమెరికా, ఇజ్రాయెల్ పంచాయతీలతో గల్ఫ్ ప్రాంతం సెగలు కక్కుతోంది. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ కన్నెర్ర చేయడం పాత కథే అయినా ఇప్పుడు ఖతార్ ఆకాశంలో పైలట్ల అదృశ్యం కొత్త రచ్చకు దారితీసింది. 'ముగ్గురు' అని ఇరాన్.. 'ఒక్కడే' అని ఖతార్ పొడుస్తున్న ఈ వింత పొడుపు కథకు క్లైమాక్స్ ఎప్పుడు పడుతుందో, ఆ మిస్సింగ్ పైలట్లు ఎప్పుడు బయటపడతారో అని గల్ఫ్ జనాలు పాప్‌కార్న్ తింటూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సీజేపీ 2.0 ప్రారంభం.. ఒకే సారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో యుద్ధం!

కాక్రోచ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజీత్ దీప్కే శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమాన్ని ప్రారంభించారు. మహారాష్ట్రలోని తన స్వగ్రామం హింగోలిలోని సంత్రుక్ పింప్రిలో స్వయంగా పాఠశాలలను సందర్శించారు. బడులను బాగు చేయించాలనే ఉద్దేశంతో కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఈ ఉద్యమం తీవ్ర ఉత్కంఠకు గురిచేస్తోంది. గతంలో విద్యార్థుల సమస్యలు, నీట్, సీబీఎస్ఈ పరీక్షల్లో లోపాలపై కేంద్ర ప్రభుత్వాన్ని హడలెత్తించేలా ఆందోళనలు నిర్వహించి విజయవంతమైంది. ఇక కాక్రోచ్ జనతా పార్టీ తాజాగా చేపట్టిన ఉద్యమం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది.

దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మహారాష్ట్రలోని హింగోలి జిల్లా సంత్రుక్ పింప్రిలో చేపట్టిన 'స్కూల్ ఠీక్ కరో' (పాఠశాలలను బాగు చేసుకోండి) ఉద్యమం జాతీయ స్థాయిలో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని ఎత్తిచూపుతూ, గ్రామీణ విద్యారంగ సమస్యలపై ఆయన చేపట్టిన ఈ వినూత్న నిరసన రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు పూర్తవుతున్నా, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మృగ్యంగా మారడంపై అభిజీత్ దీప్కే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉద్యమంలో భాగంగా ఆయన తన స్వగ్రామంలోని జెడ్పీ (జిల్లా పరిషత్) పాఠశాలను స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు.

పాఠశాలలో విద్యార్థులకు సరిపడా బెంచీలు లేకపోవడం, తాగునీటి సౌకర్యం లేకపోవడం, కిటికీలు పగిలిపోవడం వంటి సమస్యలను ఆయన బహిర్గతం చేశారు. ముఖ్యంగా,

పగిలిన కిటికీలకు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చిత్రాలు ఉన్న బ్యానర్లు కట్టడం వ్యవస్థ వైఫల్యానికి అద్దం పడుతోందని ఆయన వ్యంగ్యంగా విమర్శించారు. పాఠశాలలోని మరుగుదొడ్ల అధ్వానంగా ఉన్న తీరును ఆయన వీడియోల ద్వారా సోషల్ మీడియాలో పంచుకుంటూ, "పిల్లలు ఇలాంటి వాతావరణాన్ని ఎలా ఉపయోగించుకోవాలి?" అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తుండటంతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, తక్షణమే ఫీజులపై సీలింగ్ విధించాలని డిమాండ్ చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల లభ్యతపై 'చెక్-లిస్ట్' ఫారమ్ ద్వారా డేటాను సేకరించి, గ్రామస్థులు, తల్లిదండ్రులతో సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారు. ప్రభుత్వ బడులను నిర్లక్ష్యం చేయడం ద్వారా పేద పిల్లలకు నాణ్యమైన విద్యను దూరం చేస్తున్నారని, అందరికీ సమాన విద్య అందేలా ప్రభుత్వాలు బాధ్యత వహించాలని కోరారు.

మొదటి దశలో భాగంగా హింగోలిలో ప్రారంభమైన ఈ ఉద్యమాన్ని, రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు

అభిజీత్ దీప్కే ప్రకటించారు. కేవలం విద్యారంగానికే పరిమితం కాకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితి అంటే నేలపై పడుకోబెట్టి చికిత్సం చేయడం, సర్జరీలకు దీర్ఘకాలం వేచి ఉండే సమయం, సీటీ స్కాన్ల జాప్యంపైనా ఉద్యమం చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

తల్లిదండ్రులు కూతురికి ఇచ్చే ఆస్తిపై ట్యాక్స్ ఉంటుందా? నిబంధనలు ఇవే

కూతురికి తల్లిదండ్రులు ఆస్తి లేదా ఆభరణాలు ఇస్తే దానిపై ఆదాయపు పన్ను చెల్లించాలా? అనే సందేహం చాలామందిలో ఉంటుంది. ముఖ్యంగా పిల్లల పేరుతో ఆస్తులు బదిలీ చేసే సమయంలో పన్ను నిబంధనలు తెలుసుకోవడం చాలా ముఖ్యం. అయితే ఆదాయపు పన్ను చట్టం ప్రకారం కొన్ని కుటుంబ సంబంధాల మధ్య ఇచ్చే బహుమతులకు ప్రత్యేక మినహాయింపులు ఉన్నాయి. తల్లిదండ్రులు తమ కూతురికి నగదు, ఆభరణాలు, స్థిరాస్తి లేదా ఇతర విలువైన ఆస్తులను గిఫ్ట్‌గా ఇస్తే, సాధారణంగా ఆ బహుమతిపై కూతురు ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆదాయపు పన్ను చట్టంలోని 'రిలేటివ్' నిర్వచనం ప్రకారం తల్లిదండ్రులు, పిల్లలు, భార్య లేదా భర్త, తోబుట్టువులు, తాతలు, మనవళ్లు, మనవరాళ్లు వంటి నిర్దిష్ట బంధువుల నుంచి వచ్చే బహుమతులకు పన్ను మినహాయింపు ఉంటుంది. అంటే తల్లిదండ్రులు కూతురి పేరుపై ఇంటి స్థలం, ఇల్లు, వ్యవసాయ భూమి, బంగారు ఆభరణాలు లేదా ఇతర ఆస్తులను బహుమతిగా బదిలీ చేసినప్పుడు కేవలం ఆ బహుమతి అందుకున్నందుకు కూతురిపై ఆదాయపు పన్ను విధించరు. అయితే ఆస్తిని చట్టబద్ధంగా బదిలీ చేయడానికి అవసరమైన గిఫ్ట్ డీడ్, రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ వంటి అంశాలు మాత్రం రాష్ట్ర నిబంధనల ప్రకారం వర్తించవచ్చు. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఉంది. తల్లిదండ్రుల నుంచి ఆస్తి గిఫ్ట్‌గా వచ్చిన తర్వాత దాని ద్వారా ఆదాయం వస్తే మాత్రం పన్ను నిబంధనలు వర్తించవచ్చు. ఉదాహరణకు కూతురు ఆ ఇంటిని అద్దెకు ఇచ్చి రెంట్ పొందితే ఆ అద్దె ఆదాయం పన్ను పరిధిలోకి రావచ్చు. అలాగే ఆస్తి నుంచి వచ్చే ఇతర ఆదాయాలు, వడ్డీ వంటి వాటిపైనా సంబంధిత పన్ను నిబంధనలు వర్తిస్తాయి. అయితే స్నేహితులు లేదా చట్టపరంగా 'రిలేటివ్' పరిధిలోకి రాని వ్యక్తుల నుంచి వచ్చే బహుమతులకు వేరే నిబంధనలు ఉంటాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో పన్ను మినహాయింపు లేని వ్యక్తుల నుంచి అందుకున్న బహుమతుల మొత్తం విలువ ?50,000 దాటితే నిర్దిష్ట పరిస్థితుల్లో మొత్తం బహుమతి విలువనే ఆదాయంగా పరిగణించి పన్ను విధించే అవకాశం ఉంటుంది. అందువల్ల కూతురికి తల్లిదండ్రులు ఆస్తి ఇవ్వడం సాధారణంగా ఆదాయపు పన్ను పరంగా సమస్య కాదు. అయితే పెద్ద మొత్తంలో ఆస్తి బదిలీ చేసే ముందు గిఫ్ట్ డీడ్, రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ, భవిష్యత్‌లో ఆస్తిని విక్రయించినప్పుడు వచ్చే క్యాపిటల్ గెయిన్స్ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పెద్ద విలువైన ఆస్తుల విషయంలో పన్ను నిపుణుడి సలహా తీసుకోవడం మంచిది.

ఆర్డర్ లేట్ అయ్యిందని ఫోన్ లాక్కుని దాడి.. ఆ తర్వాత బిగ్ ట్విస్ట్!

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలు ఇప్పుడు ప్రతి ఒక్కరి జీవితంలో భాగమయ్యాయి. అయితే ఆర్డర్ కొద్దిగా ఆలస్యమైనా కొందరు కస్టమర్లు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. కేవలం కొన్ని నిమిషాల ఆలస్యంపై ఓ కస్టమర్ డెలివరీ బాయ్‌పై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపింది. అంతేకాదు.. డెలివరీ ఎగ్జిక్యూటివ్ ఫోన్‌ను లాక్కొని చెంపదెబ్బలు కొట్టి తన్నడమే కాకుండా ఇంట్లోకి తీసుకెళ్లి మరీ దాడి చేసినట్లు ఫిర్యాదు నమోదైంది. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు బయటకు రావడంతో విషయం మరింత సంచలనంగా మారింది.

ఐదు నిమిషాల ఆలస్యంతో మొదలైన వివాదం

మీరట్‌లోని గంగాసాగర్ కాలనీలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. అమిత్ అనే డెలివరీ ఎగ్జిక్యూటివ్ ఓ ఆర్డర్‌ను అందించేందుకు అపార్ట్‌మెంట్‌కు వెళ్లాడు. అక్కడ కస్టమర్ యమన్‌తో డెలివరీ ఆలస్యంపై వాగ్వాదం మొదలైంది. అమిత్ చెప్పిన వివరాల ప్రకారం.. ఆర్డర్ సుమారు ఐదు నిమిషాలు ఆలస్యంగా చేరింది. అయితే కస్టమర్ మాత్రం తాను 15 నిమిషాలు ఆలస్యంగా ఆర్డర్ అందుకున్నానంటూ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. వాగ్వాదం కాస్తా తీవ్రరూపం దాల్చడంతో పరిస్థితి అదుపు తప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీసీటీవీ దృశ్యాల్లో యమన్ డెలివరీ బాయ్ ఫోన్‌ను లాక్కొని అతడిపై దాడి చేస్తున్నట్లు కనిపించినట్లు పోలీసులు తెలిపారు. చెంపదెబ్బలు కొట్టడంతో పాటు తన్నినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం అమిత్‌ను ఇంట్లోకి తీసుకెళ్లి అక్కడ కూడా దాడి కొనసాగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

డెలివరీ బాయ్ సంచలన ఆరోపణలు

ఈ ఘటనపై అమిత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై హత్య బెదిరింపులకు పాల్పడ్డారని.. డబ్బులు తీసుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించాడు. అంతేకాదు.. తన భార్యకు సంబంధించిన వేధింపుల కేసులో ఇరికిస్తానని కూడా బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇదిలా ఉండగా ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో తోటి డెలివరీ ఏజెంట్లు స్పందించారు. వీడియో ద్వారా అమిత్‌ను గుర్తించిన వారు అతడిని సంప్రదించి.. అనంతరం భవన్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

పనులు నిలిపేసిన డెలివరీ ఏజెంట్లు

సహచరుడిపై దాడి జరిగిందన్న వార్తతో డెలివరీ ఏజెంట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కస్టమర్ అమిత్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పే వరకు డెలివరీలు చేయబోమని ప్రకటించి నిరసనకు దిగారు. "ఆర్డర్ కొన్ని నిమిషాలు ఆలస్యమైతే దాడి చేసే హక్కు ఎవరికీ లేదు" అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. డెలివరీ ఏజెంట్ల ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో 34 ఏళ్ల యమన్‌ను అరెస్టు చేసినట్లు భవన్‌పూర్ పోలీసులు వెల్లడించారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. కేవలం కొన్ని నిమిషాల ఆలస్యంతో మొదలైన చిన్న వివాదం చివరకు దాడి.. పోలీస్ కేసు.. అరెస్టు వరకు వెళ్లడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో డెలివరీ ఉద్యోగులు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న భద్రతా సమస్యలపై కూడా ఈ ఘటన మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఆర్డర్ ఆలస్యమైనప్పుడు కస్టమర్లు అసంతృప్తి వ్యక్తం చేయడం సహజమే అయినప్పటికీ.. ఆ కోపం దాడులకు దారితీయకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు చేసే కొబ్బరినూనె.. ఎందుకంటే..?

డయాబెటిస్ అనేది ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనేక మందిని ఇబ్బందులకు గురి చేస్తోంది. దీని బారిన పడుతున్న వారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా యుక్త వయస్సులో ఉన్నవారు అధిక శాతం మంది టైప్ 2 డయాబెటిస్ బారిన పడుతున్నారు. అస్తవ్యవస్తమైన జీవన శైలి ఈ వ్యాధి వచ్చేందుకు ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ఆహారం విషయంలో చాలా మంది తగు జాగ్రత్తలు పాటించడం లేదని, దీని వల్లే టైప్ 2 డయాబెటిస్ వస్తుందని అంటున్నారు. డయాబెటిస్ వచ్చిన వారు ఆహారం విషయంలో అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. లేదంటే వ్యాధి మరింత ముదిరే ప్రమాదం ఉంటుంది. ఆహారంలో పిండి పదార్థాలు, చక్కెరలు తీసుకోవడం పూర్తిగా తగ్గించాలి. లేదా మానేస్తే మంచిది. ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తీసుకుంటే మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

రోజూ ఇలా తీసుకోవాలి..

డయాబెటిస్ ఉన్నవారు పిండి పదార్థాలు, చక్కెర అధికంగా ఉండే ఆహారాలను తినడం వల్ల శరీరంలో కొవ్వు నిల్వలు పేరుకుపోతాయి. దీంతో ఇన్సులిన్ నిరోధకత మరింత పెరుగుతుంది. దీని వల్ల షుగర్ మరింత ఎక్కువవుతుంది. కనుక ఆయా ఆహారాలను తీసుకోవడం పూర్తిగా తగ్గించాల్సి ఉంటుంది. ఫైబర్ ఉండే ఆహారాలను తినాలి. దీని వల్ల షుగర్ లెవల్స్ నెమ్మదిగా పెరుగుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. అయితే డయాబెటిస్ ఉన్నవారు కొబ్బరినూనెను ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కొబ్బరినూనె డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుందని అంటున్నారు. కొబ్బరినూనెను రోజూ వంట నూనెగా ఉపయోగించవచ్చు. లేదా రాత్రి పూట నిద్రకు ముందు ఒక టీస్పూన్ మోతాదులో తీసుకోవచ్చు. దీని వల్ల డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

ఇన్సులిన్ నిరోధకతకు..

డయాబెటిస్ ఉన్నవారు రోజూ కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచవచ్చు. దీంతో ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారికి సహజంగానే అజీర్తి సమస్య ఉంటుంది. ఆహారం జీర్ణమవడం ఆలస్యం అవుతుంది. కానీ కొబ్బరినూనెను తీసుకుంటే ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. అలాగే షుగర్ ఉంటే మలబద్దకం కూడా ఇబ్బంది పెడుతుంది. కానీ కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల మలబద్దకం అన్న మాటే ఉండదు. రోజూ ఉదయం సుఖంగా విరేచనం అవుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది.

ఇన్‌ఫెక్షన్లకు చెక్..

కొబ్బరినూనెను సేవించడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. దీని వల్ల షుగర్ లెవల్స్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు. కొబ్బరినూనె యాంటీ మైక్రోబియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది. డయాబెటిస్ ఉన్నవారికి తరచూ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. కనుక వారు కొబ్బరినూనెను తీసుకుంటే ఇన్‌ఫెక్షన్‌లకు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా చర్మంపై, జననావయవాల్లో వచ్చే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కొబ్బరినూనెను తీసుకోవడం వల్ల చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. చర్మం పొడిబారకుండా చూస్తుంది. చర్మం కాంతివంతంగా కనిపించేలా చేస్తుంది. అలాగే శిరోజాలు దృఢంగా ఆరోగ్యంగా ఉంటాయి. జుట్టు రాలడం తగ్గిపోతుంది. డయాబెటిస్ ఉన్నవారు కొబ్బరినూనెను తీసుకుంటే ఇలా అనేక రకాలుగా లాభాలను పొందవచ్చు.

ఆస్తమా ఉందా.. అయితే ఈ చిట్కాలను పాటించండి.. ఉపశమనం లభిస్తుంది..!

చలికాలంలో లేదా ఇతర సమయాల్లో వాతావరణం చల్లగా ఉన్నప్పుడు చాలా మందికి శ్వాసకోశ సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా దగ్గు, జలుబు వంటి సమస్యల బారిన పడుతుంటారు. అయితే ఇవి సహజంగా వచ్చేవే. కానీ ఆస్తమా ఉన్న వారికి మాత్రం సీజన్లు మారినప్పుడు లేదా చల్లని వాతావరణం ఉన్నప్పుడు తీవ్రంగా ఇబ్బంది కలుగుతుంది. ఆస్తమాతో అల్లాడిపోతారు. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటుంది. అయితే ఆస్తమా ఉన్నవారు డాక్టర్ ఇచ్చిన మందులను క్రమం తప్పకుండా వాడాలి. అలాగే ఆహారం విషయంలోనూ అనేక జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. అయితే ఆస్తమా ఉన్నవారు పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల సమస్య నుంచి ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. అలాగే శ్వాస నాళాలు క్లియర్‌గా మారుతాయి. ఊపిరి సరిగ్గా పీల్చుకోగలుగుతారు.

పసుపు..

ఆస్తమా ఉన్నవారికి పసుపు ఎంతో మేలు చేస్తుంది. పసుపులో కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆస్తమా నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. అందుకుగాను రోజూ రాత్రి పూట ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కొద్దిగా పసుపును కలుపుకుని తాగాలి. ఇలా రోజూ చేయాలి. దీని వల్ల ఆస్తమా లక్షణాల నుంచి ఉపశమనం పొందవచ్చు. అలాగే ఆహారం విషయానికి వస్తే ఫ్లేవనాయిడ్స్, విటమిన్లు సి, డి, యాంటీ ఆక్సిడెంట్లు ఉండే ఆహారాలను తీసుకోవాలి. దీని వల్ల కూడా ఆస్తమా ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఈ ఆహారాల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల వీటిని తీసుకుంటే శ్వాస నాళాల వాపులు తగ్గిపోతాయి. దీని వల్ల శ్వాస నాళాలు క్లియర్‌గా మారి ఊపిరి సరిగ్గా తీసుకోగలుగుతారు. ఇందుకు గాను నారింజ, నిమ్మ, కివీ, ఆలుగడ్డలు, పాలు, చేపలు, గుడ్లు, లివర్, జున్ను, తృణ ధాన్యాలు, సిట్రస్ పండ్లను తీసుకోవాల్సి ఉంటుంది.

అల్లం..

ఆస్తమా ఉన్నవారు టీ, కాఫీలను తరచూ తాగుతుండాలి. చక్కెర లేకుండా బ్లాక్ టీ లేదా బ్లాక్ కాఫీ తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. వీటిల్లో అధికంగా ఉండే కెఫీన్ ఆస్తమా లక్షణాల నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. అలాగే శ్వాసనాళాలపై పడే ఒత్తిడి తగ్గిపోతుంది. దీంతో శ్వాస నాళాల వాపులు తగ్గిపోతాయి. అయితే కెఫీన్‌ను మరీ అధికంగా తీసుకోకూడదు. రోజుకు 3 లేదా కప్పుల టీ లేదా కాఫీ తాగాలి. అంతకు మించి తాగకూడదు. ఇక ఆస్తమాను తగ్గించుకునేందుకు అల్లం కూడా బాగానే పనిచేస్తుంది. ఇది గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫాన్ని తొలగిస్తుంది. శ్వాస నాళాలను వెడల్పుగా చేస్తుంది. దీని వల్ల శ్వాస సరిగ్గా లభిస్తుంది. ఆస్తమా నుంచి ఉపశమనం లభిస్తుంది. అల్లం రసాన్ని రోజూ రెండు పూటలా పూటకు ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

యూకలిప్టస్ ఆయిల్..

యూకలిప్టస్ ఆయిల్‌ను వాడుతున్నా కూడా ఆస్తమా లక్షణాలను తగ్గించుకోవచ్చు. ఇది దీర్ఘకాలిక మంటను తగ్గించడంలో సహాయం చేస్తుంది. శ్వాసనాళాల్లో ఉండే వాపులు తగ్గిపోతాయి. కఫం కరిగిపోతుంది. ఒక ఖర్చీఫ్ మీద కొద్దిగా యూకలిప్టస్ ఆయిల్‌ను వేసి దాన్ని నిద్రించేటప్పుడు ముక్కుకు దగ్గరగా పెట్టుకోవాలి. లేదా మరుగుతున్న నీటిలో కొద్దిగా యూకలిప్టస్ ఆయిల్‌ను వేసి అనంతరం వచ్చే ఆవిరిని బాగా పీల్చాలి. ఇలా చేస్తున్నా కూడా ఉపశమనం లభిస్తుంది. శ్వాస నాళాలు క్లియర్‌గా మారుతాయి. గాలి సరిగ్గా లభిస్తుంది. ఈ విధంగా పలు ఆహారాలను తీసుకుంటూ ఆయా చిట్కాలను పాటిస్తుంటే ఆస్తమా లక్షణాలను చాలా వరకు తగ్గించుకుని ఉపశమనం పొందవచ్చు.

లావు ఉన్న వారికి నిమ్మ తొక్కలు ఓ వరం.. ఎలా అంటే?

మనమందరం నిమ్మకాయలను వివిధ సందర్భాల్లో ఆహారంలో వినియోగిస్తుంటాము. అయితే ఎక్కువ మంది నిమ్మ రసాన్ని వాడుకుని.. దాని తొక్కలను పడేస్తుంటారు. అలా తొక్కే కదా అని పడేస్తే.. మనం చాలా నష్టపోయినట్లే అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా అధిక బరువు ఉన్న వాళ్లకు ఈ నిమ్మ తొక్కలు వరం లాంటివి. వాటిని సరిగ్గా వినియోగించుకుంటే.. బాడీ ఫ్యాట్ తగ్గి.. నాజూగ్గా మారవచ్చు. మరి.. నిమ్మ తొక్కలను ఎలా ఉపయోగిస్తే.. అధిక బరువు తగ్గొచ్చు ఇప్పుడు తెలుసుకుందాం..

నిమ్మ జ్యూస్ లో కంటే తొక్కలోనే ఎక్కువ పోషకాలు ఉంటాయని చాలా మందికి తెలియదు. ఈ తొక్కలు ఒక న్యూట్రియెంట్ పవర్ హౌస్ లాంటవి అని నిపుణులు చెబుతున్నారు. ఈ తొక్కలో విటమిన్-సి, డీ-లిమొనెన్, ఫెక్టిన్, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు ఉన్నాయి. దీనిలోని విటమిన్ సీ శరీరంలోని రోగ నిరోధక శక్తిని బూస్ట్ చేస్తుంది. అలానే మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి కణాల డ్యామేజ్‌ను విటమిన్-సి ఆపుతుంది. అలానే దీనిలోని ఫైబర్, ఫెక్టిన్ అనేవి జీర్ణ వ్యవస్థకు హెల్ప్ చేస్తాయి. వీటి వల్ల త్వరగా ఆకలి వేయదు. ఫ్లేవనాయిడ్స్, డీ-లిమొనెన్ లు మెటబాలిజంను పెంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి. బోన్ హెల్త్‌కు కాల్షియం, మెగ్నీషియం బలం ఇస్తాయి.

నిమ్మ తొక్కలో ఉండే డీ-లిమొనెన్ శరీరంలోని కాంపౌండ్ కొవ్వును కరిగించడానికి మెటబాలిజంను మెరుగుపరుస్తుంది. ఈ తొక్కను మన డైలీ లైఫ్ లో చేర్చుకోవడం చాలా ఈజీ. నిమ్మ తొక్కలను బాగా కడిగిన తర్వాత ఎండలో ఉంచి డ్రై చేయాలి. బాగా ఎండిన తర్వాత మిక్సీలో వేసి .. పౌడర్ లా చేయాలి. ఆ పౌడర్ ను రోజూ ఉదయం ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిలో కలుపుకొని తాగాలి. అలా రోజూ చేయడం వల్ల.. మనకు తెలియకుండానే బాడీ వెయిట్ తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గేందుకు వేలకు వేలు ఖర్చు చేయకుండా నిమ్మ తొక్కలతోనే మార్పు తెచ్చుకోవచ్చు. వాతావరణం మారినప్పుడు వచ్చే వచ్చే జలుబు, దగ్గు లాంటి వాటి నుంచి శరీరం త్వరగా కోలుకునేందుకు నిమ్మ తొక్కలు ఉపయోగపడతాయట.

పీనట్ బటర్ ఆరోగ్యకరమైందేనా..?

దీన్ని రోజుకు ఎంత తినాలి..? దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయి..?

మార్కెట్‌లో మనకు అనేక రకాల ఆహారాలు అందుబాటులో ఉన్నాయి. చాలా రకాల ఆహారాలు మనకు ప్రకృతి సహజసిద్ధంగా అందిస్తుంది. కొన్ని రకాల ఆహారాలను మనం తయారు చేసుకుని తింటాం. వాటిల్లో ఆరోగ్యకరమైనవి, అనారోగ్యకరమైనవి కూడా ఉంటాయి. అయితే ఆరోగ్యకరమైన ఆహారాల విషయానికి వస్తే వాటిల్లో పీనట్ బటర్ కూడా ఒకటి. పల్లీల నుంచి దీన్ని తయారు చేస్తారు. సాధారణంగా చాలా మంది దీన్ని అనారోగ్యకరమైన ఆహారం అని భావిస్తారు. ఎందుకంటే ఇందులో కొవ్వులు, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి కనుక దీన్ని తినకూడదని, ప్రమాదమని అనుకుంటారు. కానీ ఇందులో నిజం లేదు. ఎందుకంటే పీనట్ బటర్ వాస్తవానికి ఆరోగ్యకరమైనదే. కానీ ఇందులో చక్కెరలు, అనారోగ్యకరమైన కొవ్వులు, ఉప్పు వంటి ఆహారాలను కలపకుండా తయారు చేసింది అయి ఉండాలి. అలాంటి పీనట్ బటర్‌నే మనం తినాల్సి ఉంటుంది. మార్కెట్‌లో చాలా రకాల పీనట్ బటర్ బ్రాండ్లు మనకు లభిస్తున్నాయి. కనుక వాటిని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రోటీన్లు అధికం..

ఎలాంటి కృత్రిమ పదార్థాలు, చక్కెర, ఉప్పు లాంటి పదార్థాలను కలపకుండా తయారు చేసిన పీనట్ బటర్ అయితేనే మనం ఉపయోగించాలి. అలాంటి పీనట్ బటర్‌ను తింటేనే ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయి. పీనట్ బటర్ మనకు అనేక లాభాలను అందిస్తుంది. ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి మనకు అనేక ప్రయోజనాలను అందిస్తాయి. మాంసాహారం తినని వారికి కావల్సిన ప్రోటీన్లను పీనట్ బటర్ అందిస్తుంది. ఇందులో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి కండరాల కణజాలానికి మరమ్మత్తులు చేస్తాయి. దీని వల్ల కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. శరీరానికి శక్తి లభిస్తుంది. పీనట్ బటర్‌ను తింటే ఆరోగ్యకరమైన కొవ్వులను పొందవచ్చు. ఇందులో మోనో అన్‌శాచురేటెడ్, పాలీ అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి మంచి కొవ్వుల జాబితాకు చెందుతాయి. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

కండరాల ఆరోగ్యానికి..

పీనట్ బటర్‌లో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. దీని వల్ల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. విటమిన్ ఇ వల్ల చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పీనట్ బటర్‌ను తింటే అధిక మొత్తంలో మెగ్నీషియం లభిస్తుంది. ఇది కండరాలను దృఢంగా ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. నాడీ మండల వ్యవస్థ చురుగ్గా పనిచేసేలా చేస్తుంది. శరీరంలో శక్తి స్థాయిలను పెంచుతుంది. దీంతో ఉత్సాహంగా ఉంటారు.

యాక్టివ్‌గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. పీనట్ బటర్‌లో అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ముఖ్యంగా విటమిన్ బి3 అధికంగా ఉంటుంది. ఇది మనం తిన్న ఆహారం సులభంగా శక్తిగా మారేందుకు దోహదం చేస్తుంది. దీని వల్ల శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి.

హైబీపీ ఉన్నవారికి..

పీనట్ బటర్‌లో అధికంగా ఉండే పొటాషియం బీపీని నియంత్రిస్తుంది. శరీరంలో సోడియం స్థాయిలను తగ్గించి బీపీ అదుపులో ఉండేలా చేస్తుంది. కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుతుంది. పీనట్ బటర్‌ను తింటే జింక్ కూడా అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ఈ విధంగా పీనట్ బటర్ మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. అయితే మార్కెట్‌లో ఏ పీనట్ బటర్ పడితే దాన్ని కొనకూడదు. కృత్రిమ పదార్థాలు లేని పీనట్ బటర్‌ను కొని వాడితే మేలు జరుగుతుంది. ఇక దీన్ని రోజుకు 2 టేబుల్ స్పూన్లకు మించి తినకూడదు. అలర్జీలు ఉన్నవారు పీనట్ బటర్‌ను తినకూడదు. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ దీన్ని తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

గాలే టెస్టుపై భారత్ పూర్తి ఆధిపత్యం.. పడిక్కల్ భారీ ఇన్నింగ్స్ తో పటిష్ఠ స్థితి

గాలేలో టీమిండియా–శ్రీలంక తొలి టెస్టు

తొలి ఇన్నింగ్స్ లో దేవదత్ పడిక్కల్ భారీ సెంచరీ (167)

కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ అర్ధశతకాలు

రెండో రోజు ముగిసేసరికి 9 వికెట్లకు 460 పరుగులు చేసిన టీమిండియా

లంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్యకు 4, కేశర నువంతకు 3 వికెట్లు

హైదరాబాద్ పెన్ పవర్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌పై టీమిండియా పూర్తి పట్టు సాధించింది. యువ ఓపెనర్ దేవదత్ పడిక్కల్ (167) బాదిన అద్భుత శతకానికి, కేఎల్ రాహుల్ (82), ధ్రువ్ జురెల్ (51) సాధించిన కీలక అర్ధ శతకాలు తోడవడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 9 వికెట్ల నష్టానికి 460 పరుగుల భారీ స్కోరు చేసింది. వర్షం కారణంగా రెండో రోజు ఆట ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, భారత బ్యాటర్లు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు.వర్షం వల్ల తొలి సెషన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో, రెండో రోజు కేవలం 43 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆట తిరిగి ప్రారంభమయ్యాక భారత బ్యాటర్లు వేగంగా పరుగులు రాబట్టారు. ముఖ్యంగా పడిక్కల్ తన అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ భారీ శతకాన్ని నమోదు చేశాడు. అతనికి తోడుగా రాహుల్, వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.భారీ స్కోరు దిశగా సాగుతున్న భారత్‌ను శ్రీలంక స్పిన్నర్లు కొంతవరకు కట్టడి చేసే ప్రయత్నం చేశారు. అరంగేట్ర స్పిన్నర్ కేశర నువంత 3 వికెట్లు పడగొట్టగా, సీనియర్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య 4 వికెట్లతో రాణించాడు. రెండో కొత్త బంతితో లంక బౌలర్లు పుంజుకొని వరుసగా వికెట్లు తీశారు. రవీంద్రద

జడేజా (13)ను నువంత ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు.అయితే, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ధ్రువ్ జురెల్ దూకుడుగా ఆడాడు. కేవలం 68 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 51 పరుగులు చేసి జట్టు స్కోరును 400 దాటించాడు. అయితే, అర్ధ శతకం పూర్తయిన వెంటనే జయసూర్య బౌలింగ్‌లో స్లిప్‌లో ఉన్న కెప్టెన్
ధనంజయ డిసిల్వా అద్భుతమైన డైవింగ్ క్యాచ్ పట్టడంతో జురెల్ వెనుదిరిగాడు. చివర్లో మహమ్మద్ సిరాజ్, మానవ్ సుతార్ (24) వేగంగా పరుగులు జోడించారు.రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 460 పరుగులు చేసింది. క్రీజులో కుల్‌దీప్ యాదవ్ (12), ప్రసిద్ధ్ కృష్ణ (1) ఉన్నారు. కాగా, టీమిండియా తన ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేసి, మూడో రోజు ఉదయాన్నే శ్రీలంకను బ్యాటింగ్ కు ఆహ్వానించి, వారి లైనప్ ను ఒత్తిడిలోకి నెట్టే అవకాశం ఉంది.

సచిన్, మంజ్రేకర్ క్లబ్‌లోకి యశస్వి.. గాలే టెస్టులో అరుదైన ఘనత

- ఆడిన 30 టెస్టులను 30 వేర్వేరు వేదికల్లో ఆడి సచిన్ క్లబ్‌లో చేరిన జైస్వాల్
- ఈ మ్యాచ్‌లో 32 పరుగుల వద్ద దురదృష్టవశాత్తూ రనౌట్‌గా వెనుదిరిగిన యశస్వి
- తొలి టెస్ట్ సెంచరీతో కదం తొక్కిన యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్
- 77 పరుగులతో రాణించి కండరాల నొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కేఎల్ రాహుల్
- తొలి రోజు ఆట ముగిసేసరికి 2 వికెట్లకు 288 పరుగులతో పటిష్ఠ స్థితిలో భారత్

హైదరాబాద్ పెన్ పవర్: భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ టెస్ట్ క్రికెట్‌లో ఓ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. శ్రీలంకతో గాలే వేదికగా జరుగుతున్న తొలి టెస్టులో బరిలోకి దిగడం ద్వారా అతను భారత దిగ్గజ ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, సంజయ్ మంజ్రేకర్ క్లబ్‌లోకి చేరాడు. జైస్వాల్ తన కెరీర్‌లో ఆడిన 30 టెస్టులను 30 వేర్వేరు వేదికలపై ఆడటం విశేషం. గతంలో సంజయ్ మంజ్రేకర్ వరుసగా 33 టెస్టులు, సచిన్ టెండూల్కర్ 32 టెస్టులు వేర్వేరు మైదానాల్లో ఆడి ఈ జాబితాలో ముందున్నారు.అయితే, ఈ ప్రత్యేక మ్యాచ్‌లో జైస్వాల్‌కు నిరాశే ఎదురైంది. 32 పరుగులు చేసిన అతను, కేఎల్ రాహుల్‌తో సమన్వయ లోపం కారణంగా రనౌట్‌గా వెనుదిరిగాడు. సింగిల్ తీసే ప్రయత్నంలో ఫీల్డర్ అడ్డురావడంతో జైస్వాల్ జారిపడగా, ఇద్దరు బ్యాటర్లు ఒకే ఎండ్‌కు చేరుకున్నారు. దీంతో జైస్వాల్ పెవిలియన్ చేరాల్సి వచ్చింది. టెస్టుల్లో అతను రనౌట్ కావడం ఇది మూడోసారి.మరోవైపు, ఈ మ్యాచ్‌లో యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ తన అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన పడిక్కల్, తన తొలి టెస్ట్ శతకాన్ని నమోదు చేశాడు. శ్రీలంక బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ 134 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో కేఎల్ రాహుల్ కూడా నిలకడగా ఆడి 77 పరుగులు చేశాడు. అయితే, కండరాల నొప్పితో అతను రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడాడు.పడిక్కల్ సెంచరీ భారత జట్టుకు ఎంతో కీలకంగా మారింది. 2024 సెప్టెంబర్‌లో శుభ్‌మన్ గిల్ తర్వాత, భారత జట్టు తరఫున వన్‌డౌన్‌లో సెంచరీ చేసిన బ్యాటర్‌గా పడిక్కల్ నిలిచాడు. ఈ మధ్యకాలంలో భారత్ ఈ స్థానంలో ఏడుగురు బ్యాటర్లను ప్రయత్నించగా,

వారు పేలవ ప్రదర్శన కనబరిచారు.తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు 2 వికెట్ల నష్టానికి 288 పరుగులతో పటిష్ట స్థితిలో నిలిచింది. క్రీజులో దేవదత్ పడిక్కల్ (131 నాటౌట్), రిషభ్ పంత్ (27 నాటౌట్) ఉన్నారు. లంక బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత్, తొలి రోజు ఆటను తమ నియంత్రణలో ఉంచుకుంది. ఇక, ఇవాళ రెండో రోజు ఆట వర్షం కారణంగా ఇంకా ప్రారంభం కాలేదు.

నా విషయంలో కోహ్లీ చాలా పెద్ద తప్పు చేశాడు.. విరాట్?ని పొట్టు పొట్టు తిట్టిన జడ్డూ భాయ్!

హైదరాబాద్ పెన్ పవర్: భారత జట్టు స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తన టెస్టు కెరీర్ ప్రారంభ రోజుల్లో ఎదుర్కొన్న తీవ్రమైన మానసిక ఒత్తిడి, బ్యాటింగ్ స్థానాల మార్పులపై సంచలన విషయాలను బయట పెట్టాడు. కెరీర్ తొలి దశలో డొమెస్టిక్ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు ఉన్నప్పటికీ, టీమిండియాలో తగిన బ్యాటింగ్ స్థానం దక్కకపోవడం తన ఆత్మవిశ్వాసాన్ని ఎలా దెబ్బతీసిందో జడేజా షేర్ చేసుకున్నాడు. డైరెక్ట్‌గా ఎవరి పేరు చెప్పనప్పటికీ, ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీ కెప్టెన్సీలలో తనను లోయర్ ఆర్డర్‌కే పరిమితం చేసిన కాలాన్ని గుర్తు చేసుకుంటూ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

డొమెస్టిక్ క్రికెట్‌లో 60ం యావరేజ్:
సోనీ స్పోర్ట్స్‌లో సంజయ్ మంజ్రేకర్‌తో జరిగిన సంభాషణలో జడేజా తన భావోద్వేగాలను పంచుకున్నాడు. రంజీ ట్రోఫీ, దులీప్ ట్రోఫీ వంటి ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 60ంకి పైగా బ్యాటింగ్ సగటుతో 8,337 రన్స్ సాధించిన రికార్డు తనకున్నప్పటికీ, భారత జట్టులోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది.. తనను 8 లేదా 9వ స్థానంలో బ్యాటింగ్‌కు పంపేవారని గుర్తు చేసుకున్నాడు. కొన్నిసార్లు రవిచంద్రన్ అశ్విన్ కంటే వెనుక స్థానంలో కూడా తాను బ్యాటింగ్‌కు రావాల్సి వచ్చిందని వెల్లడించాడు.

నాపై నమ్మకం లేదనుకునేవాడిని:
రవీంద్ర జడేజా తన మానసిక స్థితిని వివరిస్తూ: నేను ప్యాడ్లు కట్టుకుని బ్యాటింగ్‌కు వెళ్లడానికి సిద్ధమవుతున్న తరుణంలో, డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న ఫాస్ట్ బౌలర్లు మ్యాచ్‌లో బౌలింగ్ చేయడానికి సిద్ధమయ్యేవారు.. అంటే నేను త్వరగా అవుటైపోతానని, బౌలింగ్ వేసే సమయం వచ్చేసిందని వారు భావించేవారు. ఆ పరిస్థితులు చూసి నా కాన్ఫిడెన్స్ బాగా దెబ్బతినేది. ఛా.. ఏంటి ఇది? జట్టు యాజమాన్యానికి నా బ్యాటింగ్‌పై కనీస నమ్మకం కూడా లేదా? అని నన్ను నేనే ప్రశ్నించుకునేవాడిని.. కానీ అదృష్టవశాత్తూ ఇప్పుడు నాకు 6వ స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం లభించిందని జడ్డూ భాయ్ చెప్పుకొచ్చాడు.

కోహ్లీ, ధోనీ హయాంలో బ్యాటింగ్ రికార్డులు ఇవే:
2012లో ఎంఎస్ ధోనీ కెప్టెన్సీలో టెస్ట్ అరంగేట్రం చేసిన రవీంద్ర జడేజా, ఆ తర్వాత విరాట్ కోహ్లీ నాయకత్వంలో ఎక్కువ కాలం ఆడాడు. తన టెస్టు కెరీర్‌లో జడేజా ఏకంగా 32 సార్లు 8వ స్థానంలో, 12 సార్లు 9వ స్థానంలో బ్యాటింగ్ చేశాడు. ఇక ఏఏ స్థానాల్లో జడ్డూ బ్యాటింగ్ చేశాడో ఇప్పుడు తెలుసుకుందాం..

మాధురీ జైన్ జగన్ గందరగోళంలో ప్రశాంతత నెలకొంది

శ్రీహరి వారసుడు.. ఈసారి భయపెట్టాలా థ్రిల్లర్ లుక్

రియల్ స్టార్ శ్రీహరి వారసుడు మేఘాంశ్ మరో డిఫరెంట్ కాన్సెప్ట్ తో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. ఆ కొత్త సినిమా రీసెంట్ గానే మొదలైంది. 'ఆస్మాన్' అనే టైటిల్ కూడా ఫిక్స్ చేశారు. ఇక ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను లేటెస్ట్ గా శ్రీహరి జయంతి సందర్భంగా రిలీజ్ చేశారు. బ్లాక్ డ్రెస్‌లో చేతిలో పాత లాంతరు పట్టుకుని మేఘాంశ్ కనిపిస్తున్నాడు. లాంతరు చుట్టూ పగిలిపోతున్న గాజు, వెనుక చీకటి వాతావరణంతో లుక్‌ను రఫ్‌గా డిజైన్ చేశారు.మోషన్ పోస్టర్‌లో ఫైర్, పెద్ది చేయి లాంటి విజువల్స్ కూడా చూపించారు. కథను చెప్పకుండా జానర్ మీద మాత్రం చిన్న హింట్ ఇచ్చేలా మొత్తం పోస్టర్ ఉంది. మేఘాంశ్‌కు 'ఆస్మాన్' కీలకమైన సినిమా. 2019లో 'రాజ్‌దూత్'తో హీరోగా పరిచయమైన ఈ యువ హీరోకు ఆ తర్వాత పెద్ద గ్యాప్ వచ్చింది. ఇప్పుడు మళ్లీ లీడ్ రోల్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు.రెగ్యులర్ కథ కాకుండా థ్రిల్లర్ జానర్‌లో కొత్తగా ప్రయత్నించాలని ఫిక్స్ అయ్యాడు. 'ఆస్మాన్'ను డిఫరెంట్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిస్తున్నారు. సస్పెన్స్‌కు కూడా కథలో ఉంటుందని టీమ్ మొదటి నుంచే చెబుతోంది. ఫస్ట్ లుక్‌లో కనిపిస్తున్న లాంతరు, మోషన్ పోస్టర్‌లోని భారీ విజువల్స్ కూడా అదే మూడ్‌ను కొనసాగించాయి. అయితే మేఘాంశ్ పాత్ర ఏంటి, పురాణాలకు కథతో ఉన్న లింక్ ఏంటి అనే వివరాలను మాత్రం బయటపెట్టలేదు.

ఈ సినిమాతో రామ్ నందన్ తెలుగు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. రామ్ మైథాలజీ, ఫాంటసీ సినిమాల్లో తనదైన ముద్ర వేసిన కోడి రామకృష్ణ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా కూడా పని చేశాడు. ఇప్పుడు అదే అనుభవంతో తెలుగు ప్రేక్షకులకు 'ఆస్మాన్' తీసుకొస్తున్నాడు. శ్రీ క్లిన్‌కారా సెల్యులోయిడ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వెంకటేష్ కొండారు, శ్రీకాంత్ మన్నెం నిర్మాతలు.ప్రశాంత్ ఆర్ విహారి సంగీతం అందిస్తుండగా షోయబ్ అహ్మద్ కెమెరామెన్ గా వర్క్ చేస్తున్నారు. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, మలయాళం, కన్నడ, అరబిక్ భాషల్లోనూ సినిమాను తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. ఇక 'ఆస్మాన్'తో మాత్రం మేఘాంశ్ తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అందుకే ఫస్ట్ లుక్‌లోనూ గత సినిమాతో పోలిక లేకుండా కొత్త టోన్ ఎంచుకున్నారు. మరి అతని కెరీర్‌కు ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను ఇస్తుందో చూడాలి.

అదితి మెరిసే చీర లుక్‌లో తలదాచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965